


DD9 వార్త
తెలుగు దినపత్రిక

## ఏ ఇంట్లో పుట్టినా వివక్ష జరుగుతుంది

**తండ్రి, అన్న, భర్త అంతా మహిళను చులకన చేస్తారు**
**జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు**
**'స్టాండ్ విత్ హర్' ప్రోగ్రాంపై తీవ్ర విమర్శలు**
**సీఎం మహిళల్ని అవమానిస్తున్నారని ఆగ్రహం**
**గివ్ హర్ స్పేస్ జాగృతి నినాదమని ప్రకటించిన కవిత**
**డబ్బుంటేనే మహిళలకు విలువ ఉంటుందని వెల్లడి**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
మహిళ దినోత్సవం రోజే కాదు.. ప్రతి రోజు మహిళలను గౌరవించేలా పరిస్థితులు మారాలి. ప్రొ.జయశంకర్, మాజీ సీఎం కేసీఆర్ లాంటి వాళ్లు ఈ నేలపై నడిచారంటే అందుకు వాళ్ల తల్లులే కారణం'అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ..మిగతా 2లో

సంపుటి : 01 సంచిక : 199 హైదరాబాద్, మార్చి, సోమవారం 09, 2026 పేజీలు : 13 వెల : 3.00

# వరల్డ్ ఛాంపియన్ భారత్...

**2007, 2024 తర్వాత మూడోసారి టీ20 ప్రపంచకప్ కైవసం చేసుకున్న భారత్**
**పొట్టి కప్‌ను డిఫెండ్ చేసుకున్న తొలి జట్టుగా టీమిండియా ప్రపంచ రికార్డు**
**ఫైనల్లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో ఘన విజయం**
**బ్యాటింగ్‌లో సంజూ శాంసన్ (89), బౌలింగ్‌లో బుమ్రా (4/15) అద్భుత ప్రదర్శన**
**అహ్మదాబాద్ వేదికగా 255 పరుగుల భారీ స్కోరు నమోదు చేసిన భారత్**

**అహ్మదాబాద్, (డిడి9 వార్త):**
టీ20 ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా మరోసారి విశ్వరూపం చూపించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన తుది పోరులో న్యూజిలాండ్‌ను చిత్తుచేసి విశ్వవిజేతగా నిలిచింది. ఈ విజయంతో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. 2007, 2024 తర్వాత ఇది టీమిండియాకు మూడో టీ20 వరల్డ్ కప్ కావడం విశేషం. మూడు సార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన ..మిగతా 3లో



# ప్రోటోకాల్ వివాదంపై వివరణ ఇవ్వండి



02

**బెంగాల్ సర్కార్‌కు కేంద్రం ఆదేశాలు**
**దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన ఘటన**
**ప్రభుత్వ తీరును తప్పుబట్టిన ప్రముఖులు**
**రాష్ట్రపతిని గౌరవించాలని సూచనలు**
**సర్కార్ వివరణపై సర్వత్రా ఆసక్తి**



# దేశాభివృద్ధిలో మహిళలే కీలకం

**మహిళా దినోత్సవంలో ప్రధాని మోడీ**
**ఆడబిడ్డల స్వయం ఉపాధికి హామీ**
**ఢిల్లీలో రూ.33 వేల కోట్ల పనులకు శ్రీకారం**
**బెంగాల్ సర్కార్ పై మోడీ ఆగ్రహం**
**రాష్ట్రపతికి జరిగిన అవమానంపై స్పందన**
**అహంకారమే నష్టాల పాలు చేస్తుందని విమర్శలు**

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా మహిళల అభివృద్ధి, మౌలిక వసతుల పురోగతికి సంబంధించిన పలు కీలక కార్యక్రమాలను ప్రారంభించారు. ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సుమారు రూ.33,500 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేయడంతో పాటు కొన్ని ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మహిళల సాధికారత, దేశ అభివృద్ధిలో వారి పాత్ర గురించి మాట్లాడారు.ప్రపంచవ్యాప్తంగా మహిళల ప్రతిభ, నాయకత్వాన్ని గుర్తించే రోజుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని ప్రధాని అన్నారు. దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, భారత ప్రభుత్వం మహిళల శక్తిని మరింత పెంచేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో భాగంగా దేశంలో పలు ప్రాంతాల్లో అమలు కానున్న అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. మౌలిక వసతులు, రవాణా, ప్రజా సేవల రంగాల్లో ఈ ప్రాజెక్టులు ..మిగతా 2లో




త్వరలో

# ఆడపిల్లలకు ఎలక్ట్రిక్ స్కూటీలు..

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల కోసం పలు కీలక నిర్ణయాలను ప్రకటించారు. మహిళల అభివృద్ధి, భద్రత, ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా పనిచేస్తోందని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం మహిళల కోసం కొత్త పథకాల గురించి వివరించారు.ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థినులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటీలు అందించే పథకాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు సీఎం ప్రకటించారు. చదువుకునే అమ్మాయిలకు ప్రయాణం సులభం కావాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మహిళలు విద్య, ఉద్యోగ రంగాల్లో మరింత ..మిగతా 2లో

**మూసీ ప్రక్షాళన ఎందుకు అడ్డుకుంటున్నారు?**
**ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సూటి ప్రశ్న**
**ఈ నెల 13న ప్రాజెక్ట్‌పై సీఎం పీపీటీ**
**ప్రజాభవన్‌లో ఘనంగా మహిళా దినోత్సవం**
**ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి**
**మహిళా జర్నలిస్టులకు సీఎం ప్రశంసలు**
**జర్నలిస్టుల ఇండ్లపై కీలక ప్రకలన**
**త్వరలో యువతులకు ఎలక్ట్రిక్ స్కూటీలు**
**హైదరాబాద్‌కు స్పెషల్ ఎలక్ట్రిక్ బస్సులు**

# రైతు బలపడితేనే దేశాభివృద్ధి

**వ్యవసాయానికి కేంద్రం పూర్తి సహకారం**
**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**
**మెదక్‌లో కేంద్ర మంత్రి పర్యటలన**
**రైతు హాస్టల్, ఫుడ్ ప్రాసెసింగ్ ల్యాబ్ ప్రారంభం**
**సేంద్రియ సాగును చేపట్టాలని పిలుపు**
**కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచన**




**హైదరాబాద్, (డిడి9 వార్త):**
రైతులు కేవలం పంటలు పండించే వారిగా మాత్రమే కాకుండా, స్వయం సమృద్ధిగా నిలబడే స్థాయికి రావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. రైతులు తమ పంటలకు సరైన విలువ పొందుతూ లాభాలు ఆర్జించేలా శిక్షణ ఇవ్వడం చాలా ముఖ్యమని ఆయన చెప్పారు. రైతులను ఆర్థికంగా బలపరిచే లక్ష్యంతో పనిచేస్తున్న సంస్థల పాత్ర ఎంతో ..మిగతా 3లో

# రాష్ట్రపతిని అడ్డుపెట్టుకొని రాజకీయం

**బీజేపీపై మమతా బెనర్జీ ఆగ్రహం**
**ప్రొటోకాల్ వివాదంపై మండిపడ్డ సీఎం**
**ఎలాంటి అవమానం జరగలేదని వెల్లడి**
**సీఎం రాజీనామాకు బీజేపీ డిమాండ్**
**రాద్ధాంతం చేస్తున్నారని దీదీ విమర్శలు**



**కోల్‌కత్తా, (డిడి9 వార్త):**
పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనకు సంబంధించిన వివాదం రాజకీయంగా మరింత వేడెక్కింది. రాష్ట్రపతి కార్యక్రమంలో ఎలాంటి ప్రోటోకాల్ ఉల్లంఘన జరగలేదని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. కార్యక్రమ నిర్వహణలో ఏమైనా లోపాలు ఉంటే వాటికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించదని కూడా ఆమె తెలిపారు. అదే సమయంలో ఈ ఘటనను కారణంగా చూపిస్తూ బీజేపీ నేతలు మాత్రం ..మిగతా 2లో

# మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

**మహిళా దినోత్సవంలో మంత్రి సీతక్క**
**హైదరాబాద్‌లోని ఆదివాసీ భవన్‌లో వేడుకలు**
**మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు**
**కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు**
**మొత్తం 30 రకాల పరీక్షలు ఉచితం**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని కోమరం భీం ఆదివాసి భవన్‌లో ఆదివారం ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, సీతక్క ముఖ్య అతిథులుగా హాజరై పలు మహిళా సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ ..మిగతా 3లో

# ప్రాజెక్టుల నిర్మాణం వేగవంతం

**భూసేకరణకు రూ.5 వేల కోట్లు**
**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**
**జూన్ 2 నాటికి నిధులు విడుదల**
**ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష**
**పెండింగ్ పనులపై ఆరా**



03

## త్వరలో ఆడపిల్లలకు ఎలక్ట్రిక్ స్కూటీలు..

**మొదటిపేజీ తరువాయి**

ముందుకు రావాలంటే ఇలాంటి సౌకర్యాలు అవసరమని చెప్పారు.

మహిళలకు ప్రభుత్వం ఇప్పటికే అనేక సదుపాయాలు అందిస్తోందని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని, స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు అందిస్తున్నామని తెలిపారు. గృహలక్ష్మి పథకం కింద గ్యాస్ సిలిండర్లపై సబ్సిడీ ఇస్తున్నామని చెప్పారు. మహిళలు ఆర్థికంగా బలపడాలనే లక్ష్యంతో ఈ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు.మహిళా దినోత్సవ వేడుకల్లో వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలను ప్రభుత్వం సత్కరించింది. సమాజంలో మహిళలు చేస్తున్న సేవలను గుర్తించి వారికి ప్రోత్సాహం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని సీఎం అన్నారు.

ఈ సందర్భంగా హైదరాబాద్ నగర అభివృద్ధి, కాలుష్య నియంత్రణ గురించి కూడా సీఎం ప్రస్తావించారు. ప్రస్తుతం నగరంలో కాలుష్యం పెరుగుతున్నందున దీనిని నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నగరాన్ని కాలుష్య రహితంగా మార్చే దిశగా అనేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.హైదరాబాద్‌లో నడుస్తున్న డీజిల్ బస్సులను దశలవారీగా తొలగించి ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామని సీఎం ప్రకటించారు. ప్రస్తుతం నగరంలో సుమారు 2500 డీజిల్ ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయని చెప్పారు. వీటిని 2026 డిసెంబర్ నాటికి పూర్తిగా తొలగించి వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. అలాగే నగరంలో నడుస్తున్న పెట్రోల్, డీజిల్ ఆటోలను కూడా భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే ప్రణాళిక ఉందని చెప్పారు. ఇందుకు అవసరమైన విధానాలను ప్రభుత్వం సిద్ధం చేస్తోందని వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు జీరో ట్యాక్స్ విధానాన్ని అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు.

హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన అన్నారు. ప్రపంచంలోని ప్రముఖ నగరాలతో పోటీ పడేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని భావిస్తున్నామని చెప్పారు. దక్షిణ కొరియా, న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతో పోటీ పడే స్థాయికి హైదరాబాద్ చేరుకోవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.నగరంలో కాలుష్యం పెరగకుండా ఉండేందుకు కొన్ని పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్ బయటకు తరలించే ప్రణాళిక కూడా ఉందని సీఎం చెప్పారు. రెడ్, ఆరెంజ్ కేటగిరీకి చెందిన పరిశ్రమలను నగరానికి బయటకు తరలించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మూసీ నది ప్రక్షాళనపై కూడా సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మూసీ నదిని శుభ్రం చేయాలని అందరూ చెబుతున్నప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటే ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని విమర్శించారు. నదుల బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. బఫర్ జోన్ పరిధిలో నిర్మించిన భవనాలకు విలువ ఉండదని తెలిపారు .ఈ పరిధిలో ఉన్న ఇళ్ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా ఉందని సీఎం చెప్పారు. అక్కడ నివసించే ప్రజలకు ప్రత్యామ్నాయ సదుపాయాలు కల్పించే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నామని తెలిపారు. సమస్యలను రాజకీయంగా ఉపయోగించుకోవడం కాకుండా పరిష్కారం కోసం అందరూ కలిసి పనిచేయాలని సూచించారు.

దేశంలోని ఇతర నగరాల్లో కూడా నదుల అభివృద్ధి పనులు జరిగాయని సీఎం గుర్తు చేశారు. అహ్మదాబాద్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్ నిర్మాణం కోసం వేలాది కుటుంబాలను తరలించిన విషయాన్ని ప్రస్తావించారు. అలాగే ఢిల్లీలో యమునా నది, ఉత్తరప్రదేశ్‌లో గంగా నది అభివృద్ధి పనులు జరిగినప్పుడు పెద్దగా అభ్యంతరాలు రాలేదని చెప్పారు. కానీ హైదరాబాద్‌లో మూసీ నది ప్రక్షాళన విషయంలో మాత్రం కొన్ని పార్టీలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు.మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై త్వరలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు సీఎం తెలిపారు. ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేయడానికి ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

## ఏ ఇంట్లో పుట్టినా వివక్ష జరుగుతుంది

**మొదటిపేజీ తరువాయి**

కల్వకుంట్ల కవిత అన్నారు.పెద్ద ఇల్లు, చిన్న ఇల్లు, పెద్ద కులం, చిన్న కులం కాదు. మహిళలమంతా ఒక్కటే కులం అని కవిత అన్నారు.'ఏ ఇంట్లో పుట్టినా సరే మహిళలపై వివక్ష జరుగుతుంది.భర్త, తండ్రి, అన్న అందరూ మహిళలను తక్కువ చేసేవారే. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలపై క్రైమ్ రేటు 22 శాతం పెరిగింది. ఆడవాళ్ల భద్రత మీ బాధ్యత. అది మీరు వేసే భిక్ష కాదని గుర్తు పెట్టుకోవాలి'అని కవిత డిమాండ్ చేశారు. బంజారా హిల్స్ తెలంగాణ జాగృతి కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలతో కలిసి కవిత కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా గివ్ హర్ స్పేస్ అనే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలందరికీ కవిత మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

ముఖ్యమంత్రి 'స్టాండ్ విత్ హర్'అనే ప్రోగ్రామ్‌తో మహిళలను అవమానించారు. మగవాళ్లు ఉంటేనే మహిళలు ముందుకు వెళ్తారనేలా కార్యక్రమం చేయటాన్ని ఖండిస్తున్నాం.'స్టాండ్ విత్ హర్'కాదు.'గివ్ హర్ స్పేస్'జాగృతి నినాదం అని కవిత అన్నారు.ఆడవాళ్లు ఎక్సర్ సైజ్, ఎడ్యుకేషన్, ఎంప్లాయి మెంట్ అనే మూడు "E" లను ఫాలో అవ్వాలి అని సూచించారు. 'మహిళలు లేకుండా తెలంగాణ ఉద్యమమే లేదు.సామాజిక తెలంగాణ సాధనలో మహిళలే కీలకం. వయసుతో సంబంధం లేకుండా మహిళలంతా రాజకీయాల్లోకి రావాలి. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ సాధనతో జాగృతి చరిత్ర సృష్టించింది' అని 'మహిళ దినోత్సవం రోజు మాత్రమే మహిళలను గుర్తిస్తూ ఆర్టికల్స్, స్టోరీస్, గొప్పగా మాట్లాడటం చేస్తుంటారు. ప్రోగ్రెసివ్ గా ఉండే మగవాళ్లు మహిళ దినోత్సవ శుభాకాంక్షలు చెబుతారు. కానీ ప్రధాన స్రవంతిలో ఉన్న మీడియా, న్యూస్ పేపర్లు, రాజకీయ పార్టీలకు చెబుతున్నా. అదే విధంగా పురుషులు కూడా గుర్తు పెట్టుకోవాల్సింది...ప్రతి రోజు మహిళల దినోత్సవమే. ప్రతిరోజు మహిళల దినోత్సవంలా ఉండేలా పరిస్థితులు మారాలి'అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పిలుపునిచ్చారు.'ఇళ్లు, స్కూల్, హాస్పిటల్ ఏదీ నడవాలన్న మహిళలు ఉండాల్సిందే. కొత్తతరం వచ్చి సమాజ సేవ చేయాలంటే మహిళలే కారణం. ఆధిపత్యం అనేది ఏ రూపంలో ఉన్న సరే మహిళలు సహించవద్దు.సామాజిక, పురుషాధిక్యతను ఎట్టి పరిస్థితుల్లో సహించే ప్రసక్తే ఉండొద్దు. వంటింటికి మహారాణి మహిళలే అంటారు. కానీ వంటింటి పాత్రలపై కూడా పురుషుల పేర్లే ఉంటాయి'అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు.

'నిజమైన హక్కులు, సమానత్వం, స్వాతంత్రం, స్వేచ్ఛ మహిళకు ఇంకా రాలేదు. బిడ్డను మోసేది మనం. కానీ ఆ బిడ్డలకు పేరు పెట్టే స్వాతంత్రం కూడా మనకు లేదు. సచివాలయంలో, అంగన్ వాడీ లో మహిళ ఉద్యోగులున్నారు. డాక్టర్లు, లాయర్లు, వ్యాపార వేత్తలు, విద్యార్థి, యువజన సంఘాల్లోనూ మహిళలు ఉన్నారు.సమాజానికి సేవ చేస్తామనే మహిళలు చాలా మంది ఉన్నారు. కానీ పొలిటికల్ పార్టీలు వారికి అవకాశం ఇవ్వటం లేదు'అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. 'జాగృతిలో మాత్రం మహిళలకు చాలా పెద్ద ఎత్తున అవకాశాలు ఇవ్వబోతున్నాం. ఆడబిడ్డలు ఇంకా అవగాహన పెంచుకునేందుకు లీడర్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇస్తాం. మనకు 33 శాతం కాదు 50 శాతం వాటా ఉండాలి. ఐతే ముందుగా 33 శాతం అయిన సరే ఒక అడుగు ముందుకు పడాలని అంగీకరించాం'అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వెల్లడించారు.

'మహిళలకు 33 శాతం రిజర్వేషన్ సాధించటంలో దేశ చరిత్రలోనే జాగృతి పేరు సువర్ణాధ్యాయంగా నిలుస్తుంది. జాగృతి అక్కాచెల్లెలు ఢిల్లీలో కూర్చొని ధర్నా చేయటం కారణంగానే మహిళ బిల్లు వచ్చింది. అయితే పోస్ట్ డేటేడ్ అన్నట్లుగా జనగణన కావాలంట. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికైనా మహిళ బిల్లు అమల్లోకి రావాలి'అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు.'అగ్రకులాల, రిజర్వేషన్లు ఉన్న కులాల మహిళలే కాదు. అన్ని కులాల్లోని మహిళలు రాజకీయాల్లోకి రావాలి. పెద్ద ఇల్లు, చిన్న ఇల్లు, పెద్ద కులం, చిన్న కులం కాదు. మహిళలమంతా ఒక్కటే కులం. ఏ ఇంట్లో పుట్టినా సరే మహిళలపై వివక్షే. మాట్లాడితే నీవు తెలివి లేని దానివి అని అంటారు. భర్త, తండ్రి, అన్న అందరూ కూడా మనల్ని అలాగే అంటారు.

# ప్రోటోకాల్ వివాదంపై వివరణ ఇవ్వండి

- బెంగాల్ సర్కార్‌కు కేంద్రం ఆదేశాలు
- దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన ఘటన
- ప్రభుత్వ తీరును తప్పుబట్టిన ప్రముఖులు
- రాష్ట్రపతిని గౌరవించాలని సూచనలు
- సర్కార్ వివరణపై సర్వత్రా ఆసక్తి





**కోల్‌కత్తా, (డిడి9 వార్త):**

పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటన సందర్భంగా జరిగిన ఏర్పాట్లు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. రాష్ట్రపతి పర్యటనలో భద్రతా ఏర్పాట్లు, ప్రోటోకాల్ విషయంలో లోపాలు జరిగాయని భావించిన కేంద్ర ప్రభుత్వం దీనిని సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలో జరిగిన ఘటనలపై పూర్తి వివరాలు ఇవ్వాలని బెంగాల్ ప్రభుత్వాన్ని కేంద్ర హోంశాఖ కోరింది.కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాష్ట్ర ముఖ్య కార్యదర్శికి లేఖ రాసి వివరణ కోరారు. రాష్ట్రపతి పర్యటన సమయంలో భద్రత, ప్రోటోకాల్, వేదిక ఏర్పాట్లు, మార్గ ఏర్పాట్లలో ఏం జరిగిందో వివరంగా తెలియజేయాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి అత్యున్నత పదవుల్లో ఉన్నవారి పర్యటనల సమయంలో పాటించాల్సిన ప్రత్యేక నియమాలు ఉంటాయి. వీటిని "బ్లూ బుక్ ప్రోటోకాల్"గా పిలుస్తారు. ఈ నియమాలు భద్రత, స్వాగతం, కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను స్పష్టంగా పేర్కొంటాయి. రాష్ట్రపతి పర్యటనలో ఈ బ్లూ బుక్ నిబంధనలు పూర్తిగా పాటించలేదనే అభిప్రాయం కేంద్రానికి ఉందని తెలుస్తోంది. శనివారం సిలిగుడి సమీపంలోని బాగ్‌డోగ్రా విమానాశ్రయం వద్ద జరిగిన ఒక గిరిజన సమాజ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పాల్గొన్నారు. ఉత్తర బెంగాల్ పర్యటనలో భాగంగా ఆమె ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అయితే అక్కడ జరిగిన ఏర్పాట్లపై ఆమె కొంత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఈ కార్యక్రమం మొదట బిధన్నగర్ ప్రాంతంలో నిర్వహించాలని నిర్ణయించారు. ఆ ప్రాంతంలో విస్తారమైన స్థలం ఉండటం వల్ల పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనే అవకాశం ఉండేది. ముఖ్యంగా సంతాల్ గిరిజన సమాజానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావచ్చని భావించారు. కానీ తరువాత కార్యక్రమ స్థలాన్ని మార్చి గోషాయిపుర్ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఇది బాగ్‌డోగ్రా విమానాశ్రయం సమీపంలో ఉంది. అయితే ఈ కొత్త వేదిక చిన్నదిగా ఉండటం వల్ల ఎక్కువ మంది హాజరు కావడం కష్టమైంది. ఈ విషయాన్ని రాష్ట్రపతి కూడా ప్రస్తావించారు.

కార్యక్రమంలో మాట్లాడిన రాష్ట్రపతి ముర్ము, బిధన్నగర్‌లో కార్యక్రమం జరిగి ఉంటే మరింత మంది ప్రజలు పాల్గొనేవారని అన్నారు. అక్కడ విస్తారమైన స్థలం ఉందని చెప్పారు. కానీ ఆ ప్రాంతంలో కార్యక్రమం నిర్వహించడానికి ఎందుకు అనుమతి ఇవ్వలేదో తనకు తెలియదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రదేశానికి ప్రజలు రావడం కొంత కష్టంగా ఉందని కూడా ఆమె అన్నారు.అలాగే తన పర్యటన సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హాజరు కాకపోవడాన్ని కూడా రాష్ట్రపతి ప్రస్తావించారు. ఆమెను తన చిన్న చెల్లెల్లా భావిస్తున్నానని చెప్పారు. తాను కూడా బంగాల్‌కు చెందిన వ్యక్తినేనని అన్నారు. ముఖ్యమంత్రి ఎందుకు రాలేదో తెలియదని చెప్పారు. అయితే అది పెద్ద విషయం కాదని, ప్రజలు సంతోషంగా ఉండాలని మాత్రమే కోరుకుంటున్నానని తెలిపారు.కేంద్రానికి అందిన నివేదికల ప్రకారం రాష్ట్రపతి బంగాల్ చేరుకున్న సమయంలో ముఖ్యమంత్రి, ముఖ్య కార్యదర్శి, డీజీపీ వంటి ఉన్నతాధికారులు విమానాశ్రయంలో లేరని సమాచారం. సాధారణంగా రాష్ట్రపతి పర్యటన సమయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఉన్నతాధికారులు స్వాగతం పలకడం ప్రోటోకాల్‌లో భాగంగా ఉంటుంది. కానీ ఈ సందర్భంలో అది జరగలేదని అధికారులు చెబుతున్నారు.విమానాశ్రయంలో రాష్ట్రపతిని స్వాగతించడానికి కేవలం సిలిగుడి మేయర్ గౌతమ్ దేవ్ మాత్రమే హాజరయ్యారని సమాచారం. ఈ అంశం కూడా కేంద్ర దృష్టికి వెళ్లింది.

ఇంకా కొన్ని ఏర్పాట్లలో కూడా లోపాలు ఉన్నాయని కేంద్రం భావిస్తోంది. ఉదాహరణకు రాష్ట్రపతి కోసం ఏర్పాటు చేసిన వాష్‌రూమ్‌లో నీరు లేకపోవడం ఒక ప్రధాన లోపంగా గుర్తించారు. అలాగే రాష్ట్రపతి ప్రయాణించిన మార్గంలో చెత్త కనిపించిందని కూడా కేంద్రానికి సమాచారం అందినట్లు తెలుస్తోంది.ఈ సంఘటనలపై పూర్తి వివరాలు ఇవ్వాలని కేంద్ర హోంశాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ముఖ్యంగా ఈ ఘటనకు సంబంధించి స్థానిక అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరించాలని కూడా లేఖలో పేర్కొన్నారు. డార్జిలింగ్ జిల్లా కలెక్టర్, సిలిగురి పోలీస్ కమిషనర్, అదనపు జిల్లా కలెక్టర్ పాత్రపై కూడా వివరాలు ఇవ్వాలని కేంద్రం కోరింది.

ఈ వివాదం రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. తృణమూల్ కాంగ్రెస్ నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఈ విషయంపై స్పందించారు.సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఆయన ఒక పోస్టు చేశారు. ఆ పోస్టులో బంగాల్‌పై కేంద్రం మరియు ఇతర సంస్థలు ఒత్తిడి తీసుకొస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఒకవైపు బంగాల్ ప్రజలు ఉంటే మరోవైపు బీజేపీ, ఈసీఐ, ఈడీ, ఐటీ, సీబీఐ, ఎన్ఐఏ, గవర్నర్, కేంద్ర మంత్రులు, ప్రధానమంత్రి వంటి సంస్థలు ఉన్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ బంగాల్ ప్రజలు బలంగా నిలబడతారని ఆయన వ్యాఖ్యానించారు.

## రాష్ట్రపతిని అడ్డుపెట్టుకొని రాజకీయం




**మొదటిపేజీ తరువాయి**

తీవ్ర విమర్శలు చేస్తూ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కోల్‌కతాలో జరిగిన ఒక నిరసన కార్యక్రమంలో మాట్లాడిన మమతా బెనర్జీ ఈ అంశంపై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. రాష్ట్రపతి పదవికి తమ ప్రభుత్వం ఎప్పుడూ గౌరవం ఇస్తుందని ఆమె చెప్పారు. భారత రాజ్యాంగానికి తాము ఎంతో ప్రాముఖ్యత ఇస్తామని కూడా తెలిపారు. రాష్ట్రపతిని అవమానించేలా ఎలాంటి చర్యలు తమ ప్రభుత్వం తీసుకోలేదని స్పష్టం చేశారు.రాష్ట్రపతి పాల్గొన్న కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలు రాష్ట్ర ప్రభుత్వానికి ముందుగా తెలియజేయలేదని మమతా బెనర్జీ ఆరోపించారు. ఆ కార్యక్రమాన్ని ప్రైవేట్ నిర్వాహకులు నిర్వహించారని, అలాగే అది ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పరిధిలో ఉన్న ప్రాంగణంలో జరిగినదని చెప్పారు. అందువల్ల అక్కడ ఏర్పాట్లలో ఏవైనా లోపాలు ఉంటే వాటికి రాష్ట్ర ప్రభుత్వాన్ని బాధ్యులను చేయడం సరైంది కాదని ఆమె పేర్కొన్నారు.

కార్యక్రమం జరిగిన ప్రదేశంలో కొన్ని సమస్యలు ఉన్నాయనే విషయాన్ని కూడా మమతా బెనర్జీ ప్రస్తావించారు. అక్కడ చెత్త నిర్వహణ సరిగా లేకపోవడం, గ్రీన్ రూమ్‌లో సరైన సదుపాయాలు లేకపోవడం, మహిళల కోసం తగిన టాయిలెట్ సదుపాయాలు లేకపోవడం వంటి అంశాలు ఉన్నాయని ఆమె చెప్పారు. అయితే ఈ సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా బీజేపీపై కూడా మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. ఆమె ఒక ఫోటోను చూపిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఆ ఫోటోలో ప్రధాని నరేంద్ర మోదీ కూర్చుని ఉండగా రాష్ట్రపతి నిలబడి ఉన్నట్లు కనిపిస్తుందని ఆమె చెప్పారు. అలాంటి సందర్భాలు జరిగినప్పటికీ తాము ఎవ్వరినీ అవమానించలేదని ఆమె పేర్కొన్నారు. "మేము రాష్ట్రపతిని అవమానించే సంస్కృతి కలిగినవారు కాదు. రాష్ట్రపతి పదవిని గౌరవించని సంస్కృతి బీజేపీదే" అని ఆమె వ్యాఖ్యానించారు. తాము రాజ్యాంగాన్ని తల్లిలా భావిస్తామని కూడా చెప్పారు.ఈ వివాదాన్ని రాజకీయంగా మలుస్తున్నారని కూడా ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ అంశాన్ని పెద్దదిగా చూపుతున్నారని మమతా బెనర్జీ అన్నారు. ఎన్నికల ముందు తమ ప్రభుత్వాన్ని అపఖ్యాతి పాలుచేయడానికి ప్రయత్నం జరుగుతోందని ఆమె విమర్శించారు.

ఇదే సమయంలో బీజేపీ నేతలు మాత్రం ఈ ఘటనపై తీవ్రంగా స్పందిస్తున్నారు. రాష్ట్రపతిని అవమానించినందుకు ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.బీజేపీ ఎంపీ ఖగేన్ ముర్ము మాట్లాడుతూ ఈ ఘటన చాలా బాధాకరమని అన్నారు. రాష్ట్రపతి పదవికి గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఆదివాసీ సమాజానికి చెందిన తొలి మహిళా రాష్ట్రపతిగా ఉన్న ద్రౌపది ముర్ముకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు.

రాష్ట్రపతిని స్వాగతించేందుకు ముఖ్యమంత్రి లేదా మంత్రులు రాకపోవడం సరైంది కాదని ఆయన విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఖగేన్ ముర్ము డిమాండ్ చేశారు. కేవలం క్షమాపణ చెప్పడం సరిపోదని కూడా ఆయన వ్యాఖ్యానించారు.అలాగే ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బంగాల్‌ను వ్యక్తిగత రాజ్యంలా పాలిస్తున్నారని కూడా ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలా వ్యవహరించడం సరైంది కాదని అన్నారు.

బీజేపీ జాతీయ ప్రతినిధి సీఆర్ కేశవన్ కూడా ఈ ఘటనపై స్పందించారు. రాష్ట్రపతి పర్యటన సమయంలో జరిగిన ఘటనను ఆయన అవమానకరంగా అభివర్ణించారు. అంతర్జాతీయ సంతాలి సదస్సుకు మొదట నిర్ణయించిన ప్రదేశంలో కార్యక్రమం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. దీంతో కార్యక్రమాన్ని చివరి నిమిషంలో మరో ప్రదేశానికి మార్చాల్సి వచ్చిందని ఆయన చెప్పారు. ఈ మార్పు కారణంగా అనేక మంది ప్రతినిధులు కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని ఆయన తెలిపారు.

రాష్ట్రపతి పట్ల ఇలా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఆదివాసీ సమాజానికి చెందిన తొలి మహిళా రాష్ట్రపతిపై ఇలా జరగడం దేశానికి బాధ కలిగించే విషయం అని అన్నారు.ఇక ఈ ఘటనపై ప్రతిపక్ష నాయకులు కూడా స్పందించాలని ఆయన కోరారు. ముఖ్యంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వంటి నేతలు ఈ విషయంపై తమ అభిప్రాయాన్ని వెల్లడించాలని ఆయన అన్నారు.

## దేశాభివృద్ధిలో మహిళలే కీలకం

**మొదటిపేజీ తరువాయి**

ఉపయోగపడతాయని ప్రధాని వివరించారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఇవి తోడ్పడతాయని చెప్పారు.అయితే, తన ప్రసంగంలో ప్రధాని మోదీ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై కూడా తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సంబంధించిన ఒక సంఘటనను ప్రస్తావిస్తూ టీఎంసీ ప్రభుత్వం ప్రోటోకాల్‌ను పాటించలేదని ఆయన ఆరోపించారు. రాష్ట్రపతికి తగిన గౌరవం ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారని ప్రధాని తెలిపారు. సంతాల్ గిరిజన సమాజానికి సంబంధించిన ఒక ముఖ్యమైన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారని చెప్పారు. కానీ ఆ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు.రాష్ట్రపతిని గౌరవించాల్సిన సమయంలో టీఎంసీ నాయకులు కార్యక్రమాన్ని బహిష్కరించడం సరికాదని ప్రధాని విమర్శించారు. ఇది కేవలం రాష్ట్రపతికి జరిగిన అవమానం మాత్రమే కాకుండా రాజ్యాంగానికి కూడా అవమానమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న అత్యున్నత పదవికి గౌరవం ఇవ్వకపోవడం మంచిది కాదని ఆయన పేర్కొన్నారు.


మన దేశంలో ఎవరు ఎంత శక్తివంతులైనా చివరకు అహంకారం వారికి నష్టమే తెస్తుందని ప్రధాని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నవారు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. టీఎంసీ ప్రభుత్వం చేస్తున్న రాజకీయాలు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆయన అన్నారు.ఈ ఘటనను బెంగాల్ ప్రజలు సులభంగా మర్చిపోరని ప్రధాని హెచ్చరించారు. ఒక మహిళగా, ఒక గిరిజన సమాజానికి చెందిన నాయకురాలిగా, దేశ రాష్ట్రపతిగా ఉన్న ద్రౌపది ముర్ముకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన చెప్పారు.

ఈ వివాదానికి కారణమైన సంఘటన డార్జిలింగ్ జిల్లాలో జరిగిన ఒక సమావేశానికి సంబంధించినది. ఉత్తర బెంగాల్ పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 9వ అంతర్జాతీయ సంతాల్ సదస్సులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మొదట ఈ సమావేశాన్ని బిధాన్ నగర్ ప్రాంతంలో నిర్వహించాలని నిర్ణయించారు. అక్కడ సంతాల్ గిరిజన సమాజానికి చెందిన పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనే అవకాశం ఉండేది. కానీ తరువాత రాష్ట్ర ప్రభుత్వం భద్రతా కారణాలు, రద్దీ సమస్యలు వంటి కారణాలు చూపుతూ కార్యక్రమ స్థలాన్ని మార్చింది.

చివరికి ఈ కార్యక్రమాన్ని బాగ్డోగ్రా విమానాశ్రయం సమీపంలోని గోషైపూర్ ప్రాంతానికి మార్చారు. అయితే కొత్తగా ఎంపిక చేసిన వేదిక చిన్నదిగా ఉందని, అక్కడ ఎక్కువ మంది హాజరు కావడం కష్టమని కొందరు అభిప్రాయపడ్డారు.వేదిక మార్పుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో గిరిజన సమాజ సభ్యులు రావాలని భావించినప్పటికీ వేదిక పరిమితి వల్ల అది సాధ్యం కాలేదని చెబుతున్నారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హాజరు కాలేదు. అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఇతర మంత్రులు కూడా రాష్ట్రపతిని స్వాగతించడానికి రాలేదని తెలుస్తోంది. దీంతో ప్రోటోకాల్‌కు సంబంధించిన వివాదం చెలరేగింది.ఈ విషయంపై మాట్లాడిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా స్వల్పంగా స్పందించారు. మమతా బెనర్జీని తన చెల్లెలుగా భావిస్తున్నానని ఆమె చెప్పారు. ముఖ్యమంత్రి తనను స్వాగతించడానికి రాకపోవడం వెనుక ఏదైనా కారణం ఉందా అని ప్రశ్నించారు. ఆమె తనపై కోపంగా ఉన్నారా అని కూడా సరదాగా వ్యాఖ్యానించినట్లు సమాచారం.ఈ వ్యాఖ్యలు వెలువడిన తర్వాత ఈ విషయం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. రాజకీయ వర్గాల్లో కూడా దీనిపై చర్చ జరుగుతోంది. కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజకీయ భేదాలు ఉన్నప్పటికీ రాజ్యాంగ పదవులకు గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందని కొందరు నాయకులు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు, మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సాధికారతపై ప్రధాని మోదీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వస్తున్నారని ఆయన అన్నారు. విద్య, ఉద్యోగాలు, వ్యాపారం, రాజకీయాలు వంటి రంగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

దేశ అభివృద్ధి కోసం మహిళల శక్తిని వినియోగించుకోవడం చాలా అవసరమని ప్రధాని అన్నారు. మహిళలకు అవకాశాలు పెంచితే సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుందని ఆయన చెప్పారు. మహిళల సాధికారతను ప్రభుత్వం ముఖ్య లక్ష్యంగా తీసుకుని పనిచేస్తోందని వివరించారు.మహిళల విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని ప్రధాని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలను స్వయం ఉపాధి వైపు తీసుకెళ్లే కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు.



# మహిళల ఆరోగ్యానికి పెద్దపీట



**మొదటిపేజీ తరువాయి**

డయాగ్నస్టిక్స్ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు 30 రకాల ఉచిత ఆరోగ్య పరీక్షలను మంత్రులు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మంత్రులు స్వయంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అలాగే బస్ స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో శిశువులకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఈ గదుల నమూనాను మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం కౌమార బాలికలకు హెచ్‌పీవీ టీకా వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ఆన్‌లైన్ పోర్టల్ "మహిళా వసతి" ను మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ ఆవిష్కరించారు.

**అవకాశం ఇస్తే మహిళలు పంట పొలాల నుంచి..**

అలాగే "ఇందిరా మహిళా శక్తి అచీవ్‌మెంట్స్" పుస్తకాన్ని మంత్రి సీతక్క విడుదల చేశారు. కార్యక్రమంలో వినూత్న వ్యాపారాలతో రాణిస్తున్న 31 మంది మహిళలను మంత్రి సీతక్క ఘనంగా సన్మానించి, వారికి రూ.25,000 చొప్పున ఆర్థిక ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళలే సమాజానికి మూలాధారం అని పేర్కొన్నారు. ఒకప్పుడు మహిళలకు ఓటు హక్కు కూడా లేకపోయినా పోరాటాల ద్వారా తమ హక్కులను సాధించుకున్నారని తెలిపారు. అవకాశం ఇస్తే మహిళలు పంట పొలాల నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు.. పంట పొలాల్లో 80 శాతం పనిని మహిళలే చేస్తారని పేర్కొంటూ, ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. మహిళలు అందరి గురించి ఆలోచిస్తారని కానీ తమ ఆరోగ్యం గురించి పట్టించుకునే సమయం ఉండదని, అందుకే మహిళా సంఘాల సభ్యులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి వివరించారు.

**హైటెక్ సిటీలో వందల కోట్ల విలువైన మార్కెట్‌ను..**

ముందుగానే వ్యాధులను గుర్తించి వైద్య సదుపాయాలు అందించడమే లక్ష్యమని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా లోన్లు అందించి పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. హైటెక్ సిటీలో వందల కోట్ల విలువైన మార్కెట్‌ను మహిళా సంఘాలకు అప్పగించినట్లు చెప్పారు. మహిళలు ఇప్పపువ్వు లడ్డూల నుంచి రైస్ మిల్లుల నిర్వహణ, సోలార్ ప్లాంట్ల వరకు వ్యాపారాల్లో ముందుకు వస్తున్నారని తెలిపారు..మేడారం జాతరలో 565 మహిళా సంఘాలకు దుకాణాలు ఏర్పాటు చేసి, రూ.6 కోట్ల పెట్టుబడితో రూ.3.5 కోట్లకు పైగా లాభాలు సాధించారని మంత్రి తెలిపారు. ఒకప్పుడు చిన్నచిన్న వ్యాపారాలు చేసిన మహిళలు ఇప్పుడు సంపద సృష్టికర్తలుగా ఎదుగుతున్నారని అన్నారు.. మహిళలు బాల్య వివాహాలను అడ్డుకోవాలని, అమ్మాయిలకు న్యాయం జరిగేలా మహిళా సంఘాలు ముందుండాలని పిలుపునిచ్చారు. వచ్చే మహిళా దినోత్సవానికి వేలాది మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

**వచ్చే మూడు నెలల్లో..?**

మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదగడం సమాజ అభివృద్ధికి కీలకమని అన్నారు. మహిళా సంఘాలపై బ్యాంకులకు ఎంతో విశ్వాసముందని, వారు తీసుకున్న రుణాలను 98 శాతం తిరిగి చెల్లిస్తున్నారని తెలిపారు.. ఆరోగ్యం బాగుండాలని ప్రభుత్వం భావిస్తోందని, అందుకే స్వయం సహాయక సంఘాల సభ్యులందరికీ 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వచ్చే మూడు నెలల్లో ఈ పరీక్షలను పూర్తిచేసి, మహిళలకు డిజిటల్ ఆరోగ్య కార్డులను అందజేస్తామని వెల్లడించారు.. అమ్మాయిల బంగారు భవిష్యత్తు కోసం హెచ్‌పీవీ టీకాను అందిస్తున్నామని, ప్రతి గ్రామంలో మహిళా సంఘాలు ఈ టీకా గురించి అవగాహన కల్పించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, క్రిస్టినా చోంగ్తు, అనితా రామచంద్రన్, దివ్య దేవరాజన్, శృతి ఓజా, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరేంద్ర కుమార్, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రైతు బలపడితేనే దేశాభివృద్ధి

**మొదటిపేజీ తరువాయి**

గొప్పదని ఆయన కొనియాడారు.మెదక్ జిల్లాలోని తునికిలో ఉన్న డాక్టర్ రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కృషి విజ్ఞాన కేంద్రంలో కొత్తగా నిర్మించిన రైతుల వసతి గృహం (ఫార్మర్స్ హాస్టల్)తో పాటు "ఫార్మర్స్ వాల్యూ అడిషన్ & ఫుడ్ ప్రాసెసింగ్ ల్యాబొరేటరీ"ను కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కేవీకే కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి వాటి గురించి తెలుసుకున్నారు. రైతుల అభివృద్ధి కోసం అక్కడ జరుగుతున్న శిక్షణా కార్యక్రమాలపై నిర్వాహకులతో మాట్లాడారు.దేశంలో అనేక సంస్థలు ఉన్నప్పటికీ, రైతుల కోసం నిజాయితీగా మరియు లాభాపేక్ష లేకుండా పనిచేసే సంస్థలు చాలా అరుదుగా ఉంటాయని బండి సంజయ్ అన్నారు. ఏకలవ్య గ్రామీణ ఫౌండేషన్ మరియు కృషి విజ్ఞాన కేంద్రం రైతుల అభ్యున్నతిని లక్ష్యంగా పెట్టుకుని చేస్తున్న సేవలు నిజంగా అభినందనీయం అని చెప్పారు.రైతుల కోసం నిర్మించిన హాస్టల్ సౌకర్యాలు కార్పొరేట్ హాస్టళ్లను తలపించేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రైతులు శిక్షణ కోసం వచ్చినప్పుడు వారికి సరైన వసతి కల్పించడం చాలా అవసరమని చెప్పారు. అలాగే రైతులు పండించే పంటలతో కొత్త ఉత్పత్తులు తయారు చేయడం, వాటిని అందంగా ప్యాకింగ్ చేసి మార్కెట్లో అమ్మడం వంటి విషయాలను నేర్పించడానికి ఈ ఫుడ్ ప్రాసెసింగ్ ల్యాబ్ ఉపయోగపడుతుందని అన్నారు.రైతులు తమ పంటలకు విలువ పెంచే విధానాలు నేర్చుకుంటే మంచి ఆదాయం పొందగలరని మంత్రి తెలిపారు. పంటను కేవలం అమ్మడం మాత్రమే కాకుండా, ప్రాసెసింగ్ చేసి కొత్త ఉత్పత్తులుగా మార్చి విక్రయిస్తే రైతులకు మరింత లాభం వస్తుందని వివరించారు.

సేంద్రీయ వ్యవసాయం గురించి కూడా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. మనం ప్రకృతిని మరియు సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను విస్మరించడం వల్లనే అనేక సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. రసాయనాల వాడకం తగ్గించి సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం అందించవచ్చని చెప్పారు.ప్రస్తుతం దేశంలో దాదాపు 60 కోట్ల మంది ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని మంత్రి తెలిపారు. తెలంగాణలో కూడా సుమారు 60 లక్షల మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని చెప్పారు. అయితే రైతు కుటుంబాల సగటు నెలవారీ ఆదాయం ఇంకా చాలా తక్కువగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



సగటున ఒక రైతు కుటుంబం నెలకు 10 నుండి 12 వేల రూపాయల మధ్య మాత్రమే సంపాదిస్తోందని చెప్పారు. అంటే సంవత్సరానికి సుమారు 1 లక్ష 20 వేల రూపాయల వరకు మాత్రమే ఆదాయం వస్తుందని తెలిపారు. ఇది ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఒక నెలలో సంపాదించే మొత్తంతో పోలిస్తే చాలా తక్కువ అని పేర్కొన్నారు.ఇంత కష్టపడి పంటలు పండించినా కొన్ని సార్లు ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోతుందని ఆయన చెప్పారు. దీంతో రైతులు అప్పుల్లో కూరుకుపోయే పరిస్థితి వస్తుందని తెలిపారు. అయినప్పటికీ రైతు ఎప్పుడూ వెనక్కి తగ్గకుండా పంటలు పండిస్తూ దేశ ప్రజలకు అన్నం అందిస్తున్నాడని అన్నారు. అందుకే రైతులను బలపర్చడం మన అందరి బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. రైతుల ఆదాయం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని బండి సంజయ్ తెలిపారు.

# ప్రాజెక్టుల నిర్మాణం వేగవంతం

- **భూసేకరణకు రూ.5 వేల కోట్లు**
- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**
- **జూన్ 2 నాటికి నిధులు విడుదల**
- **ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష**
- **పెండింగ్ పనులపై ఆరా**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న ప్రధాన ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల కోసం అవసరమైన భూసేకరణకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించనున్నట్లు ఆయన వెల్లడించారు. జూన్ 2 నాటికి భూసేకరణ కోసం అవసరమైన నిధులను విడుదల చేస్తామని మంత్రి చెప్పారు. మొత్తం రాష్ట్రవ్యాప్తంగా భూసేకరణ కోసం సుమారు రూ.5 వేల కోట్ల వరకు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు త్వరగా పూర్తవ్వాలంటే ముందుగా భూసేకరణ ప్రక్రియ పూర్తి కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.హైదరాబాద్‌లోని జలసౌధలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించిన ముఖ్య ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా వంటి ముఖ్య సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని పరిశీలించారు. ప్రాజెక్టుల నిర్మాణం ఎంతవరకు పూర్తయిందో, ఇంకా ఎలాంటి పనులు మిగిలి ఉన్నాయో అధికారులు వివరించారు.

సమీక్ష సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న అనేక సాగునీటి ప్రాజెక్టులు గత కొన్నేళ్లుగా పూర్తి స్థాయిలో ముందుకు సాగలేదని ఆయన అన్నారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టులపై సరైన శ్రద్ధ చూపలేదని ఆయన విమర్శించారు.2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో ఈ ప్రాజెక్టులు ఏ స్థితిలో ఉన్నాయో, 2024 జూన్ 2 నాటికీ దాదాపు అదే పరిస్థితి కొనసాగిందని ఆయన పేర్కొన్నారు. పదేళ్ల పాటు ఈ ప్రాజెక్టులు పెద్దగా పురోగతి సాధించలేదని ఆయన అన్నారు.



ప్రత్యేకంగా కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు మహబూబ్‌నగర్ ప్రాంతానికి చాలా ముఖ్యమైనవని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని చెప్పారు. రైతులకు పెద్ద ఎత్తున లాభం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయాన్ని కూడా మంత్రి ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నీటి వనరుల విషయంలో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రానికి నష్టం కలిగించాయని ఆయన అన్నారు. ప్రాజెక్టుకు నీటి సోర్సును మార్చడం వల్ల అనేక సాంకేతిక సమస్యలు వచ్చాయని తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన కొన్ని పొరపాట్లు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో కూడా జరిగినట్లు మంత్రి విమర్శించారు. సరైన ప్రణాళిక లేకుండా కొన్ని నిర్ణయాలు తీసుకోవడం వల్ల ప్రాజెక్టు అమలులో సమస్యలు ఏర్పడ్డాయని ఆయన చెప్పారు.అయితే ఇప్పుడు ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు.

# వరంగల్ నగరానికి భూగర్భ డ్రైయినేజీ మంజూరు...

- **సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ డా. కడియం కావ్య కృతజ్ఞతలు**

**జనగామ మర్చి 8 (డిడి 9 వార్త )**

వరంగల్ మహానగరానికి భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ (అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ) ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5,257.20 కోట్లకు పాలనాపరమైన మంజూరు ఇవ్వడం పట్ల శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి *వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ మహానగరానికి భూగర్భ డ్రెయినేజీ ప్రాజెక్టు మంజూరు చేయడం ద్వారా దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రజల కలను ముఖ్యమంత్రి నెరవేర్చారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి గారు వరంగల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు.



హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో రెండో ప్రధాన నగరంగా వరంగల్ మహానగరాన్ని అభివృద్ధి చేస్తామని ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నారని ఎంపీ తెలిపారు. మౌలిక సదుపాయాలు, వైద్య, విద్య, రవాణా తదితర అన్ని రంగాల్లో వరంగల్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందని ఎంపీ అన్నారు. భూగర్భ డ్రెయినేజీ ప్రాజెక్టు అమలుతో నగరంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు వరద ముంపు సమస్యలు కూడా తగ్గుముఖం పడతాయని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వరంగల్ మహానగర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.



వరంగల్‌ను రెండో రాజధానిగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులను అమలు చేస్తున్నదని చెప్పారు. త్వరలోనే మామునూర్ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని, అలాగే రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ స్థాపనతో పాటు కాకతీయ టెక్స్‌టైల్ పరిశ్రమల ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు అమలులోకి వస్తే వరంగల్ పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో కొత్త దశకు చేరుకుంటుందని ఎంపీ డా.కడియం కావ్య స్పష్టం చేశారు.

# శ్రీ సరస్వతి శిశు మందిర్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**ఆదిలాబాద్ జిల్లా,బోథ్ మార్చి 8 (డి డి 9 )**

బోథ్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండ రాజేంద్ర గౌడ్ మహిళలు సైన్స్, రాజకీయాలు, సాంకేతికత మరియు రక్షణ రంగాలలో పురోగతిని సాధించారని, భారత దేశంలో స్త్రీకి అత్యున్నత స్థానం కలదని, మహిళలను గౌరవించాలని ,ఆపరేషన్ సింధూర్ లో ఇద్దరు మాతృమూర్తులు కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ నాయకత్వం వహించి, విజయం సాధించారని విద్యార్థులకు తెలియజేశారు. అన్ని రంగాలలో ఉన్నత స్థానం పొందిన మాతృమూర్తులను ఆదర్శంగా తీసుకొని, దేశ అభివృద్ధికి విద్యార్థులు తోడ్పడాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో విద్యార్థులు మహిళా టీచర్లను గౌరవించి, వారికి పాదాభివందనం చేశారు, మహిళా టీచర్స్ ఆటల పోటీలలో పాల్గొని ,పిల్లలను అలరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు



# వరల్డ్ ఛాంపియన్ భారత్...

**మొదటిపేజీ తరువాయి**

తొలిజట్టుగా టీమిండియా రికార్డు నెలకొల్పింది. దాంతోపాటే, ఆతిథ్య జట్టు వరల్డ్ కప్ నెగ్గడం కూడా ఇదే తొలిసారి. అంతేకాదు, టీ20 ప్రపంచకప్ చరిత్రలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగి, టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి జట్టుగా టీమిండియా రికార్డులకెక్కింది. సొంతగడ్డపై జరిగిన ఈ మెగా ఫైనల్లో భారత్ ఏకంగా 96 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించి ట్రోఫీని ముద్దాడింది.

256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. భారత బౌలర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. భారత పేస్ దళపతి జస్ప్రీత్ బుమ్రా తన మ్యాజిక్ బౌలింగ్‌తో కివీస్ పతనాన్ని శాసించాడు. కేవలం 15 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డి విరిచాడు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ టిమ్ సీఫెర్ట్ (52), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (43) మాత్రమే పోరాడారు. వీరిద్దరూ మినహా మిగిలిన బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలవలేకపోయారు. ముఖ్యంగా డారిల్ మిచెల్ (17), ఫిన్ అలెన్ (9), రచిన్ రవీంద్ర (1) వంటి స్టార్ ప్లేయర్లు విఫలమవడంతో కివీస్ 19 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో బుమ్రా 4, అక్షర్ పటేల్ 3 వికెట్లు పడగొట్టగా.. హార్దిక్, వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ తలో వికెట్ దక్కించుకున్నారు.



అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. న్యూజిలాండ్ బౌలర్లపై విరుచుకుపడింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. తొలి వికెట్‌కు వీరిద్దరూ కేవలం 7.1 ఓవర్లలోనే 98 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అభిషేక్ శర్మ 21 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 52 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆ తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్ (54)తో కలిసి సంజూ శాంసన్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ముఖ్యంగా శాంసన్ కివీస్ బౌలర్లను ఊచకోత కోశాడు. 46 బంతుల్లో 5 ఫోర్లు, ఏకంగా 8 సిక్సర్లతో 89 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. చివర్లో శివమ్ దూబే (26 నాటౌట్) ధాటిగా ఆడటంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. సూర్యకుమార్ యాదవ్ డకౌట్ అయినా.. టీమిండియా సమిష్టి ప్రదర్శనతో మూడోసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది.



## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఘన సన్మానం

**బీర్కూర్, మర్చి 08(డిడి9 వార్త):**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలో వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న మహిళలకు ఘన సన్మానం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలను ప్రత్యేకంగా సత్కరించి వారి సేవలను ప్రశంసించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అనిల్ కుమార్ మాట్లాడుతూ మహిళలు కుటుంబం మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధిలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. విద్య, ఉపాధి, రాజకీయాలు, సామాజిక సేవ వంటి రంగాల్లో మహిళలు ముందంజలో నిలుస్తున్నారని, వారి సాధన సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించి సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని ఆకాంక్షించారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు ఐక్యంగా ఉండి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు .ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రవీణ్ దేశ్ ముఖ్,వార్డు సభ్యులు అన్నం అనిల్, బట్టికాడి భూమవ్వ, గైని సాయిలు, బాలేష్, హన్మండ్లు, వడ్ల యాదవరావు, శివకళ, రేణుకా, గంగవ్వ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని మహిళలను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## సేవాలాల్ మహారాజ్ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం: ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి





**బోధన్, నిజామాబాద్ 08 మార్చి(డీడీ9 వార్త) :**

బంజారాల ఆరాధ్య దైవం, ఆధ్యాత్మిక గురువు సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం సమాజ శ్రేయస్సుకు ఎంతో ఆదర్శనీయమని ప్రభుత్వ ముఖ్య సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి కొనియాడారు. ఆదివారం బోధన్ పట్టణంలోని పెగడపల్లి రోడ్డులో గల బంజారాలకు కేటాయించిన స్థలంలో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... సేవాలాల్ మహారాజ్ కేవలం బంజారాలకే కాకుండా, యావత్ సమాజానికి దిశానిర్దేశం చేసిన మహనీయులని కొనియాడారు. ఆయన బోధించిన శాంతి, అహింస, ప్రేమ మరియు సామాజిక ఐక్యత నేటి ఆధునిక కాలంలో మరింత అవసరమని ఆయన పేర్కొన్నారు. అంధవిశ్వాసాలను పారద్రోలి, విద్య మరియు క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని బంజారా సోదర సోదరీమణులకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను పురస్కరించుకుని బంజారా సోదరులందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బంజారా సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనేదే ప్రభుత్వ ఆశయమని ఈ దిశగా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. ఈ వేడుకల్లో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేష్ రెడ్డి, నూడా చైర్మన్ కేశవేణు, బోధన్ మున్సిపల్ చైర్మన్ పద్మా శరత్ రెడ్డి మాట్లాడుతూ.. మహనీయుల ఆశయ సాధనలో భాగంగా బంజారా సంఘం చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగా శంకర్, నాగేశ్వరరావు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, బంజారా సంఘం ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళలు, యువత మరియు బంజారా సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## ఇటుకలు తొలగించాడని అన్నపై తమ్ముడు దాడి

**కోటగిరి, మార్చి 08(డిడి9 వార్త):**

కోటగిరి మండలం కేంద్రంలోని బోయిగల్లిలో కుటుంబ కలహాల కారణంగా అన్నపై తమ్ముడు దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొప్పుల సాయిలు (40) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. అతని తల్లిదండ్రులు ప్రస్తుతం అతని తమ్ముడు పోశెట్టి ఇంట్లో నివసిస్తున్నారు.ఈ నెల 7వ తేదీ సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో సాయిలు తమ్ముడు కొప్పుల మక్కయ్య తన తల్లిదండ్రులు ఇంట్లోకి వెళ్లకుండా అడ్డుగా ఇంటి ముందు ఇటుకలను పేర్చినట్లు తెలుస్తోంది. రాత్రి సుమారు 8 గంటల సమయంలో సాయిలు తన తండ్రి సాయిబోయిని ఇంటి వద్ద దింపడానికి వెళ్లి అడ్డుగా ఉన్న ఇటుకలను తొలగించాడు.అదే సమయంలో అక్కడికి వచ్చిన మక్కయ్య మరియు అతని భార్య నిఖిత “ఇటుకలను ఎందుకు తీస్తున్నావు” అంటూ గొడవకు దిగినట్లు సమాచారం. ఈ క్రమంలో వారు బూతు మాటలు తిట్టగా, మక్కయ్య ఇటుకతో సాయిలు తలపై కొట్టడంతో అతనికి రక్త గాయం అయినట్లు తెలిసింది. అంతేకాక మక్కయ్య అత్త బొంతల మక్కవ్వ (భర్త చిన్నబోయి) మరియు బావమరిది బొంతల రాజు కూడా అక్కడికి వచ్చి సాయిలును దుర్భాషలాడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## బినోలలో మహిళా సేవా మూర్తులకు సన్మానం

**బోధన్, నిజామాబాద్ జిల్లా 08 మార్చి(డీడీ9 వార్త) :**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నవీపేట మండలం బినోల గ్రామంలో ఆదివారం వేడుకలు మిన్నంటాయి. గ్రామ సర్పంచ్ పుట్ట రేవతి పోశెట్టి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధిలో భాగస్వాములవుతున్న మహిళా శక్తిని ఘనంగా గౌరవించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిరంతరం సేవలందిస్తున్న ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ మహిళా సిబ్బందిని సర్పంచ్ రేవతి పోశెట్టి శాలువాలతో సన్మానించి, మెమెంటోలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సమాజ గమనంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని, ముఖ్యంగా గ్రామాభివృద్ధిలో మహిళల కృషి ఎంతో కీలకమని కొనియాడారు. అంకితభావంతో సేవలందిస్తున్న మహిళా సిబ్బంది అందరికీ ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు అందజేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే ఆదర్శవంతమైన సమాజం సాధ్యమవుతుందని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

## ఎడపల్లి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి వినతి

**బోధన్, నిజామాబాద్ జిల్లా 08 మార్చి(డీడీ9 వార్త) :**

ఎడపల్లి గ్రామపంచాయతీలో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామం ఉప సర్పంచ్ మచ్చుకూర్ గంగాధర్ ఆదివారం ప్రభుత్వ ముఖ్య సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ... గ్రామపంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ మరియు బిల్ కలెక్టర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో రోజువారీ పాలన, ప్రజలకు అందాల్సిన సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆయన వివరించారు. వీటితో పాటు గ్రామంలో ఉన్న మరికొన్ని మౌలిక వసతుల సమస్యలను కూడా ఆయన ఎమ్మెల్యేకు నివేదించారు. సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, వీటిపై సానుకూలంగా స్పందించారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి తగిన చర్యలు తీసుకుంటామని, గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయడంలో ప్రత్యేక చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏఎంసీ డైరెక్టర్ బొబ్బిలి శ్రీనివాస్, స్థానిక నాయకులు మస్తాన్, నవీన్, గోపి, శేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





## జ్ఞాపకాల జడిలో.. చౌట్ పల్లి పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నిజామాబాద్ జిల్లా 08 మార్చి(డీడీ9 వార్త) :**

దశాబ్దాల కాలం చెరిగిపోయినా, నాటి స్నేహ బంధం మాత్రం చెక్కుచెదరలేదని కమ్మర్ పల్లి మండలం చౌట్ పల్లి జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు నిరూపించారు. 200001 విద్యా సంవత్సరంలో ఇదే పాఠశాలలో కలిసి చదువుకున్న మిత్రులంతా నేడు ఒకే చోట చేరి ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకున్న మిత్రులు ఆనందంతో ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తమను విద్యావంతులుగా తీర్చిదిద్దిన గురువులను వేదికపైకి ఆహ్వానించి, శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ఒకప్పటి తరగతి గదుల్లోని అల్లరి, ఆటపాటలు, ఉపాధ్యాయుల పాఠాలు, అప్పటి మధుర క్షణాలను ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. వివిధ రంగాల్లో స్థిరపడిన మిత్రులంతా తమ యోగక్షేమాలను పంచుకుంటూ, మళ్లీ పాత రోజుల్లోకి వెళ్లినట్లుగా అనుభూతి చెందారు. తమను తీర్చిదిద్దిన గురువుల ఆశీర్వాదాలు పొందడం ఎంతో ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఇంటింటికీ వెళ్లి అవగాహన

**నిజామాబాద్ జిల్లా 08 మార్చి(డీడీ9 వార్త) :**

కమ్మర్ పల్లి మండలంలోని చౌట్ పల్లి గ్రామంలో ఆదివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఇందులో భాగంగా ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ మహబూబ్‌లు సంయుక్తంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఇంట్లోనూ చెత్తను వేరు చేసి పంచాయతీ వాహనాలకు అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారి నుండి రక్షణ పొందవచ్చని, డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు లేదా ఇతర వ్యర్థాలను వేయవద్దని సూచించారు. సర్పంచ్ మహబూబ్ మాట్లాడుతూ.. గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సదాశివ, పంచాయతీ కార్యదర్శి శివ, వివిధ వార్డుల సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు మరియు గ్రామ పంచాయతీ పాల్గొన్నారు.



## నగరంలో జగదాంబ సేవలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన

**నిజామాబాద్ జిల్లా 08 మార్చి(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ నగరంలోని ఇందిరా ప్రియదర్శిని కాలనీలో జగదాంబ సేవలాల్ మహారాజ్ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణలు, విశేష పూజా కార్యక్రమాలతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో ఐక్యతను, శాంతిని పెంపొందించడంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఇలాంటి కార్యక్రమాలు మన సంస్కృతీ సంప్రదాయాలను భావి తరాలకు అందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో పయనిస్తూ సామాజిక శ్రేయస్సు కోసం పాటుపడాలని కోరారు. నగర మేయర్ ఉమ రాణి మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, నాయకులు, కాలనీ వాసులు మరియు బంజారా ప్రతినిధులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

**నిజామాబాద్ జిల్లా 08 మార్చి(డీడీ9 వార్త) :**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో మహిళలకు సురక్షిత ప్రయాణం అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారం రోజుల పాటు సాగనున్న ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బంది రైల్వే స్టేషన్ ఆవరణలో ర్యాలీ నిర్వహించి, మహిళా భద్రతపై నినాదాలు చేశారు. స్టేషన్‌కు వచ్చే మహిళా ప్రయాణికులకు గులాబీ పూలు అందజేసి, వారికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ గౌరవించారు. రైలు ప్రయాణాల్లో మహిళల రక్షణ, వేధింపుల నిరోధం మరియు అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్ల గురించి ప్రయాణికులకు వివరించారు.రైల్వే స్టేషన్ వెలుపల ఉండే ఆటో, టాక్సీ డ్రైవర్లకు మహిళా భద్రతపై అవగాహన కల్పించారు. మహిళా ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, వారి సురక్షిత ప్రయాణానికి బాధ్యత వహించాలని కోరుతూ అందరితో ప్రమాణం చేయించారు. మహిళల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, సురక్షిత ప్రయాణమే తమ లక్ష్యమని ఆర్పీఎఫ్ అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు, సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.




## భీమగల్‌లో తప్పిన పెను ప్రమాదం

**నిజామాబాద్ జిల్లా 08 మార్చి(డీడీ9 వార్త) :**

భీమగల్ పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ ఆవరణలో ఆదివారం అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ... గెస్ట్ హౌస్ చుట్టుపక్కల పేరుకుపోయిన చెత్తాచెదారానికి గుర్తుతెలియని వ్యక్తులు బీడీ తాగి పడేయడం వల్ల అకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయి. ఆ సమయంలో అక్కడే వాకింగ్ చేస్తున్న స్థానికుడు శ్రీనివాస్ మంటలను గమనించి వెంటనే అగ్నిమాపక కేంద్రానికి 101 సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు విస్తరించక ముందే శ్రమించి పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. సకాలంలో సమాచారం అందించిన శ్రీనివాస్ చొరవను వెంటనే స్పందించిన ఫైర్ సిబ్బంది పనితీరును పట్టణ ప్రజలు అభినందించారు. గెస్ట్ హౌస్ ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్త పేరుకుపోవడం వల్లే ఇలాంటి ఘటనలు



## క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యం : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్ జిల్లా 08 మార్చి(డీడీ9 వార్త) :**



గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత హెచ్‌పివి వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ప్రారంభించారు. నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. 14 నుంచి 15 ఏళ్లలోపు బాలికలకు ఈ వ్యాక్సిన్ ఎంతో అవసరమని, దీనివల్ల 95 శాతం వరకు క్యాన్సర్ ముప్పును నివారించవచ్చని స్పష్టం చేశారు. జిల్లాలో ఈ వయసు కలిగిన 12,363 మంది బాలికలకు మిషన్ మోడ్‌లో టీకాలు వేయించాలని అధికారులను ఆదేశించారు. గతంలో కేవలం ప్రైవేట్ ఆసుపత్రుల్లోనే అందుబాటులో ఉండి సామాన్యులకు భారంగా మారిన ఈ వ్యాక్సిన్‌ను, ఇప్పుడు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని గుర్తుచేశారు. టీకా పట్ల తల్లిదండ్రులు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, భవిష్యత్తులో పిల్లలు అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే టీకా వేయించడం తప్పనిసరని కలెక్టర్ సూచించారు. జిజిహెచ్‌తో పాటు జిల్లాలోని డిచ్ పల్లి , దర్పల్లి, నవిపేట్, వర్ని, మోర్తాడ్, బాల్కొండ, ఆర్మూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కూడా ఈ సదుపాయం అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. టీకా తీసుకున్న వారు తప్పనిసరిగా సర్టిఫికేట్ తీసుకోవాలని, రానున్న రోజుల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టే హెల్త్ ప్రొఫైల్ కోసం ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. టీకా అనంతరం శారీరక బలహీనత వల్ల స్వల్ప జ్వరం లేదా అలసట రావడం సహజమని, పారాసిటమాల్ వాడితే సరిపోతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాజశ్రీ వివరించారు. వ్యాక్సిన్ తీసుకున్న బాలికలు ఎక్కువగా ద్రవ పదార్థాలు, కొబ్బరి నీళ్లు తీసుకోవాలని, మసాలాలు, మిర్చి వంటి పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

- **మహిళలను సన్మానించిన, సుడి శ్రీనివాసరెడ్డి**

**గోవిందరావుపేట, మార్చి 8 (డి డి 9 వార్త)**

బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పస్రా గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఆదివారంఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాటికొండ శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ, వార్డు సభ్యులైన మహిళలను, బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ సుడి శ్రీనివాసరెడ్డి, శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా, సుడి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మహిళల సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు అయ్యాయని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, ఆరోగ్య లక్ష్మి, షీ టీమ్స్ వంటి పథకాల ద్వారా మహిళల గౌరవం, భద్రత, ఆర్థిక స్థిరత్వం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మహిళలు ధైర్యం, పట్టుదలతో ప్రతి రంగంలో ముందంజలో నిలవాలని ఆయన ఆకాంక్షించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు సభ్యురాలు ఏకుల లక్ష్మి, పద్నాలుగో వార్డు సభ్యురాలు బక్క సరిత, మాజీ ఎంపిటీసీ వెలిశాల స్వరూప, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ జ్యోతి, లకావత్ మమత, వరదం దేవేంద్ర, పృథ్వీరాజ్ ఉట్ల, మాజీ ఎంపిటీసీ లకావత్ చందులాల్, ధనుంజయ్, ఎస్ పాండురంగ, వర్ధన్ చందర్ రాజు, శ్యామల సమ్మిరెడ్డి, సుడి సతీష్ రెడ్డి, చెరుకు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## ములుగు ఏజెన్సీలో కల్తీ ముప్పు ?

- **కల్తీ ఆహారంతో ప్రజలకు అనారోగ్యం**
- **ఫుడ్ సేఫ్టీ అధికారుల అడ్రస్ ఎక్కడ?**

**డీ డీ 9 వార్త, ములుగు బ్యూరో :**

ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో కల్తీ ఆహార పదార్థాలు రాజ్యమేలుతున్నాయి. చిరు వ్యాపారులతో మొదలుపడితే బడా వ్యాపారులుఆహార పదార్థాలు కల్తీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ఎందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. కల్తీ ఆహర పదార్థాలు తయారు చేసే వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో దొరికే కల్తీ ఆహార పదార్థాలు, నిత్యావసర వస్తువులపై ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. పాలు, పెరుగు, ఎర్ర మిర్చి పొడి, మిరియాలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వంటి ఆహార పదార్థాల్లో భారీగా కల్తీ జరుగుతున్నట్టు సమాచారం వెలుగులోకి వస్తోంది. మిరియాల్లో బొప్పాయి గింజలు కలిపి అమ్ముతున్న ఘటనలు బయటపడుతున్నాయి. ఇటువంటి కల్తీ పదార్థాలు మన ఆరోగ్యాన్ని నేరుగా దెబ్బతీస్తున్నాయి. ఇంకా మరోవైపు కల్తీ తంబాకు, గుట్కా, నాసిరకం మద్యం, బెల్ట్ షాపులు గ్రామాలు పట్టణాలు తేడా లేకుండా విస్తరిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎక్కడ ఉన్నారు? ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎవరికి ఉంది? అనే ప్రశ్నలు సామాన్య ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి.ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ఈ కల్తీ వ్యాపారాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ ఇప్పటివరకు గట్టి చర్యలు కనిపించకపోవడం ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. ఇక ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొనుగోలు చేసే ఆహార పదార్థాలు నిజమైనవేనా? కల్తీ ఉన్నాయా? అనే విషయాన్ని మనమే పరిశీలించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. లేదంటే మన ఆరోగ్యమే ప్రమాదంలో పడే అవకాశం ఉంది.







## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 1.50 కోట్ల రూపాయల కార్పొరేట్ సంస్థల సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో బేబీ ఫీడింగ్ రూమ్స్, స్త్రీల క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ల అందజేత...







**ఆదిలాబాద్, మార్చి 8 (డిడి 9వార్త ప్రతినిధి ):-**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోల్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో CSR (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో 25 బేబీ ఫీడింగ్ రూమ్ లను ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది...స్త్రీల ఆత్మ గౌరవానికి ప్రాధాన్యత ఇస్తూ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు... అదే విధంగా ఇండియా ఆయిల్ కార్పొరేషన్ CSR నిధులతో ఇచ్చోడ మరియు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రుల కు సర్వైకల్ క్యాన్సర్ మరియు బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ లను అందజేశారు... రెండు కార్పొరేట్ సంస్థల ద్వారా 1.50 కోట్ల రూపాయల సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్స్ తో ఈ సామాజిక కార్యక్రమాలను చేపట్టారు.. ఎంపీ గోడం నగేష్ చొరవతో ఈ నిధులకు జిల్లాకు కేటాయించబడ్డాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ రెండు కార్పొరేట్ సంస్థలకు సంబంధించిన సామాజిక బాధ్యత నిధులను జిల్లాలో మహిళల ఆత్మ గౌరవం, వైద్యం కొరకు కేటాయించడం అభినందనీయమని జిల్లాలో మహిళలకు ఉపయోగపడేలా ఈ నిధులతో బేబీ ఫీడింగ్ గదులను, సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ లను అందుబాటులో వచ్చేలా కృషి చేసిన సన్ చారిటబుల్ ట్రస్ట్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు... ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్, సన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అశోక్ ముస్తాపూరే,dm&dho నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ , ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధూలు తదితరులు పాల్గొన్నారు..



## రెంజల్ మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- **ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కోరిన సర్పంచులు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 08 మార్చి(డీడీ9 వార్త) :**

రెంజల్ మండలంలోని గ్రామాల అభివృద్ధిని వేగవంతం చేయాలని పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని సర్పంచుల సంఘం కోరింది. రెంజల్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షురాలు సుహాసిని నితిన్ నేతృత్వంలో మండలంలోని 17 గ్రామాల సర్పంచులు బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తూ గత రెండు సంవత్సరాలుగా గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజి కాల్వల నిర్మాణం, త్రాగునీటి సమస్యలు, విద్యుత్ సరఫరా పనులు తదితర మౌలిక వసతుల కల్పన పెండింగ్‌లో ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో నెలకొన్న ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి నిధులు కేటాయించాలని కోరారు. సర్పంచుల విన్నపంపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. నిలిచిపోయిన పనులను దశలవారీగా పూర్తి చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ఓబీసీ అధ్యక్షుడు రాజారెడ్డితో పాటు సర్పంచులు శంకర్, ఆవుల సవిత, భానుచందర్, జ్యోతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మొదలైన ఇందూరు తిరుమల పుష్కర బ్రహ్మోత్సవాలు

**నిజామాబాద్ జిల్లా 08 మార్చి(డీడీ9 వార్త) :**

శ్రమైక దైవిక సౌందర్యానుభూతితో, ఆధ్యాత్మిక చింతనతో నర్సింగపల్లిలోని ఇందూరు తిరుమల క్షేత్రంలో 12వ పుష్కర బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. యజ్ఞాచార్యులు శ్రీ సముద్రాల శ్రీనివాసాచార్యుల చేతుల మీదుగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగడంతో ఈ పవిత్ర కార్యక్రమం మొదలైంది. నర్సింగపల్లి గ్రామస్తుల అకుంఠిత శ్రమదానం, శ్రీమాన్ నరసింహారెడ్డి గారి సంకల్ప బలం, దిల్ రాజు కుటుంబ సభ్యుల సహకారంతో నిర్మితమైన గోవింద వనమాల క్షేత్రంకు నేటితో 12 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని 13వ సంవత్సరంలో అడుగుపెడుతున్న వేళ పుష్కర బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు రోహిత్ కుమారాచార్య మాట్లాడుతూ, ఆలయానికి 12 ఏళ్లు పూర్తి కావడంతో స్వామివారి ప్రాభవం రెట్టింపు అవుతుందని పేర్కొన్నారు. లోక కల్యాణార్థం నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన వేంకటేశ్వర స్వామికి అత్యంత ప్రీతికరమని, ఈ వేడుకల్లో పాల్గొనే భక్తులకు సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. ఈ క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు జరగడం ఈ ప్రాంతానికే ఒక శుభ సూచకమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నర్సింహ్మా రెడ్డి, విజయసింహారెడ్డి, సంపత్ కుమారాచార్య, రోహిత్ కుమారాచార్య, నరాల సుధాకర్, నర్సారెడ్డి, రమేష్, మురళి, భాస్కర్, సురేష్, గంగారెడ్డి, సాయిలు, సాయి, రాములు తదితరులు పాల్గొన్నారు.



## పదవ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి...ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

- **మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే..**
- **అశ్వరావుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు...**

**అశ్వరావుపేట:మార్చి08 (డిడి 9 వార్త)**









ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గారు అశ్వారావుపేట మండలంలోని అనంతారం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల మరియు పెద్దవాగు ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు ఈ సందర్భంగా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యా సామర్థ్యం వసతి సదుపాయాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షలు దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత దృష్టి పెట్టి ప్రత్యేకంగా బలహీనంగా ఉన్న విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు గిరిజన ప్రాంతాల విద్యార్థులు కూడా ఉన్నత విద్యను సాధించి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తుందని పేర్కొన్నారు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, అధికారులు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఐపీఎస్ సుమతి సూచనలతో మావోయిస్టుల్లో మార్పు

- **అణచివేతకు ఆయుధం కాదు... అక్షరమే శక్తి**
- **చదువుతోనే సమాజంలో గౌరవం సాధ్యం – సుమతి**
- **అడవుల్లో జీవితం వృథా చేసుకోవద్దని సూచన**
- **మహిళా మావోయిస్టులపై ప్రభావం చూపిన ఐపీఎస్ సందేశం**
- **ఆయుధాలను వదిలి లొంగిపోయిన కేంద్ర కమిటీ మహిళా కమాండర్**
- **ముఖ్యమంత్రి ఎదుట తుపాకులు అప్పగించిన మావోయిస్టులు**
- **ప్రజాస్వామ్య పద్ధతిలోనే పోరాటం చేస్తామని వెల్లడి**
- **మహిళా దినోత్సవం సందర్భంగా సంచలన ప్రకటన**
- **ఐపీఎస్ సుమతిని అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
- **మావోయిస్టుల్లో మార్పు రావడం సంతోషకరం సీఎం**

**ఏటూరునాగారం క్రైం, మార్చి 08 (డీడీ9 వార్త):**

సమాజంలో ఎదగాలంటే ఆయుధం కాదు, అక్షరజ్ఞానం అవసరమని మహిళా ఐపీఎస్ అధికారి సుమతి చేసిన సూచనలు మావోయిస్టుల్లో మార్పుకు దారితీసినట్టు ఒక మహిళా మావోయిస్టు కమాండర్ వెల్లడించింది. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

అడవుల్లో ఎన్నో సంవత్సరాలుగా తుపాకులు పట్టుకుని తిరుగుతున్న తాము, ఐపీఎస్ సుమతి చెప్పిన మాటలతో ఆలోచనలో మార్పు వచ్చిందని ఆ మహిళా కమాండర్ తెలిపింది. అణచివేతను ఎదుర్కొనే మార్గం తుపాకి కాదని, చదువు ద్వారానే సమాజంలో గౌరవం సంపాదించవచ్చని ఆమె చెప్పిన మాటలు తమపై ప్రభావం చూపాయని వివరించింది.

తాము కేంద్ర కమిటీకి చెందిన మిలిటరీ విభాగంలో పనిచేసినట్లు, ఒక అగ్రనేతకు భద్రతగా ఉన్నట్లు ముఖ్యమంత్రి ముందు వివరించింది. చిన్న వయసులోనే తుపాకి పట్టాల్సి వచ్చిన పరిస్థితులను కూడా ఆమె వెల్లడించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానంగా, ఇకపై ఆయుధాలను వదిలి సాధారణ ప్రజల జీవన విధానంలోకి వస్తామని తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే తమ సమస్యలను చెప్పుకుంటూ, ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

**సుమతి సూచనలతో మారిన జీవితం**

అడవుల్లో ఉండి జీవితాలను వృథా చేసుకోవద్దని ఐపీఎస్ సుమతి చెప్పిన సందేశం తమలో ఆలోచనలకు దారి తీసిందని ఆ మహిళా మావోయిస్టు తెలిపింది. కాలం మారిందని, ప్రపంచం ముందుకు సాగుతోందని, చదువు ద్వారానే వ్యక్తి ఎదుగుదల సాధ్యమని ఆమె చెప్పిన మాటలు తమకు మార్గదర్శకంగా మారాయని పేర్కొంది. ఈ మార్పు నేపథ్యంలో తుపాకులను ప్రభుత్వానికి అప్పగించి, జనజీవనంలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

**మహిళా దినోత్సవంలో ప్రత్యేక సందేశం**

ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ సంఘటన రాష్ట్రంలో విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. అడవుల్లో తుపాకులు పట్టిన మహిళా మావోయిస్టుల్లో కూడా మార్పు తీసుకురావడంలో మహిళా ఐపీఎస్ అధికారి సుమతి చేసిన ప్రయత్నాలను పలువురు ప్రశంసిస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుమతి సేవలను అభినందించారు. జీవితాల్లో మార్పు తీసుకురావడం, బతుకు బాట చూపించడం ఎంతో గొప్ప విషయం అని ఆయన పేర్కొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయి జనజీవనంలోకి రావడం రాష్ట్రానికి సంతోషకర పరిణామమని తెలిపారు.

# అశ్వారావుపేటలో HPV వ్యాక్సినేషన్ కార్యక్రమానికి శ్రీకారం







- **ఎమ్మెల్యే జారే ఆదినారాయణ....**
- **బాలికల ఆరోగ్య రక్షణకు ముందడుగు – ఎమ్మెల్యే జారె పిలుపు....**

**అశ్వరావుపేట:మార్చి08(డిడి9 వార్త)**

అశ్వారావుపేట మున్సిపాలిటీ లోని ఏరియా ఆసుపత్రిలో బాలికల ఆరోగ్య పరిరక్షణను లక్ష్యంగా పెట్టుకుని నిర్వహిస్తున్న HPV (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ సభ్యులు జారె ఆదినారాయణ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థినులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, మహిళలు మరియు బాలికల ఆరోగ్య రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. భవిష్యత్తులో మహిళలను తీవ్రంగా ప్రభావితం చేసే గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల నుంచి రక్షణ కల్పించడంలో HPV వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. దేశంలో మహిళల్లో ఎక్కువగా కనిపించే గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడానికి ముందస్తు జాగ్రత్తగా ఈ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగకరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బాలికలకు ఉచితంగా HPV వ్యాక్సిన్ అందించే కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. 14 సంవత్సరాలు పూర్తై 15 సంవత్సరాలలోపు ఉన్న ప్రతి బాలిక తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య శాఖ అధికారులు గ్రామాలు, పాఠశాలలు, కాలనీలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి అర్హత కలిగిన బాలికకు వ్యాక్సిన్ అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, ముఖ్యంగా మహిళలు, బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు HPV వైరస్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి విద్యార్థినులకు మరియు వారి తల్లిదండ్రులకు వివరించారు. వ్యాక్సిన్ పూర్తిగా సురక్షితమని, దీని వల్ల భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ ప్రమాదం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అర్హత కలిగిన బాలికలకు వ్యాక్సిన్ ప్రక్రియను ప్రారంభించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆసుపత్రి సిబ్బంది బాలికలకు వ్యాక్సిన్ అందించి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, కోలా లక్ష్మీనారాయణ, ప్రమోద్, కౌన్సిలర్ మిండా హరిబాబు , ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులు, నర్సింగ్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థినులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేక గ్రామ బీఆర్ఎస్ నాయకులు ఆటంకాలు

- **విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**బోనకల్,మార్చి08,(డీడీ9 వార్త):**

మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరుగుతున్న అపూర్వ అభివృద్ధి,సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అడ్డూ అదుపులేని ఆరోపణలు చేస్తూ,పనులకు ఆటంకాలు కలిగిస్తున్నారని బ్రాహ్మణపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి తీరుపై తీవ్రంగా మండిపడ్డారు.గ్రామంలో ప్రజాదరణను తట్టుకోలేకనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని,గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకుంటే సహించేది లేదని స్థానిక గ్రామ శాఖ అధ్యక్షుడు పెద్దప్రోలు సైదులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు హెచ్చరించారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో నిర్మిస్తున్న విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణాన్ని అడ్డుకోవాలని పదేపదే పలు రకాల విమర్శలు చేస్తూ ఆటంకాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు,రైతులకు,సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు నిరంతరాయంగా విద్యుత్ అందించాలని త్వరితగతిన పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తపన పడుతుంటే సబ్ స్టేషన్ నిర్మాణ నిర్మాణానికి ఆటంకం కలిగించాలని,అడ్డంకులు సృష్టించాలని గ్రామ బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ వంగల రామారావు ఆరోపించారు,ఇప్పటికైనా వారి తీరు మార్చుకోవాలని నాయకులు హితవుపలికారు,లేకపోతే ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ వంగాల రామారావు,మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగసాని రాఘవరావు,మాజీ సొసైటీ డైరెక్టర్ తాటికొండ అచ్చయ్య,మాజీ సర్పంచ్ దామాల బాబు,తాటికొండ కిరణ్,పెద్దప్రోలు తిరుపతిరావు,తాటికొండ ఇశ్రాయేలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపు.

- **ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు, అంతర్గాం మండల సర్పంచులు.**
- **ఉచిత ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు అందించిన- మేడి లైఫ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్.**
- **వైద్య నిమిత్తం వచ్చిన ప్రజలకు ఉచిత భోజనం.అందించిన ట్రస్టు.**

**డిడి9వార్త / పెద్దపల్లి మార్చి 9:**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం టి టి ఎస్ అంతర్గాం గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ నందు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ సౌజన్యంతో, మిడిల్ లైఫ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సహకారంతో మండలంలోని సుమారు 15 వేల వందల మంది గ్రామ ప్రజలకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్, అంతర్గాం మండల సర్పంచులు ఉచిత వైద్య సేవలు అందించడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ అంగోతు రవి కుమార్ నాయక్ మాట్లాడుతూ.. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ సౌజన్యంతో ,మేడి లైఫ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సహకారంతో మండలంలోని గ్రామ ప్రజలకు సుమారు 15 మంది డాక్టర్ల చేత వివిధ రకాలైన వ్యాధులకు సంబంధిత డాక్టర్లు ఊపిరితిత్తుల పరీక్షలు, గుండె పరీక్షలు, కంటి పరీక్షలు, షుగర్ పరీక్షలు ,స్కానింగ్, వివిధ రకాలైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వాటికి సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. అనంతరం మండలంలోని ప్రజలు వైద్య నిమిత్తం సుమారు 15 వేల వందల మంది రావడంతో వారికి మధ్యాహ్న భోజనం వసతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్టు వారు ఉచితంగా భోజన వసతి కల్పించడం జరిగిందని, ప్రజలకు ఉపయోగపడే విధంగా ఇలాంటి గొప్ప కార్యక్రమం నిర్వహించినటువంటి ,దీనికి సహకరించినటువంటి రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ కు ,డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ కు, మేడి లైఫ్ సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్ డాక్టర్ల బృందానికి, అంతర్గాం మండల సర్పంచులకు మండలంలోని గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలపడం జరిగిందని, మేడి లైఫ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారికి కూడా మన అంతర్గాం మండల గ్రామ ప్రజల పక్షాన, మా మండల సర్పంచుల పక్షాన, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్ట్ పక్షాన ,ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని గ్రామ సర్పంచ్ అంగోతు రవి కుమార్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడి లైఫ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ కుమారస్వామి, అంతర్గాం మండల సర్పంచులు, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు, అంతర్గం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బోయ వెంకటస్వామి, మేడి లైఫ్ హాస్పటల్ వైద్య బృందం, వివిధ గ్రామాల పాలకవర్గం, వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు అంతర్గం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బోయ వెంకటస్వామి, మేడి లైఫ్ హాస్పటల్ వైద్య బృందం, వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మహిళా దినోత్సవ కార్యక్రమంలో నారాయణపురం సర్పంచ్ మడకం కుమారి ఆంధ్రయ , సెక్రెటరీ భూనోత్ మహేశ్వరి సన్మానించిన వైస్ ప్రెసిడెంట్ ఆకుల.శీను....

- **సర్పంచ్ మడకం.కుమారి ఆంధ్రయ, సెక్రెటరీ బోనోత్ మహేశ్వరి, మహిళవార్డు సభ్యులను ఘనంగా పుష్పగుచ్చం సాలువలతో సన్మాన ఉత్సవం..**



**అశ్వరావుపేట:మార్చి08 (డి డి 9 వార్త)**

ఈరోజు అశ్వారావుపేట మండలం లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా అశ్వారావుపేట రైతు వేదికలో వార్డ్ మెంబర్స్ శిక్షణ తరగతులు నాలుగు రోజుల నుంచి జరుగుతూ ఈరోజు శిక్షణా తరగతులు పూర్తయిన తర్వాత వీరికి అధికారులు సర్టిఫికెట్స్ వార్డ్ మెంబర్స్ కి అందజేశారు ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత నారాయణపురం వైస్ ప్రెసిడెంట్ ఆకుల శీను ద్వారా మహిళా ప్రతినిధులు, మహిళా అధికారులకు ఘనంగా పుష్పగుచ్ఛాలతో సాలవల తో సన్మానం చేసినారు ఆయన పంచాయతీ అభివృద్ధి దిశగా సర్పంచ్ కుమారి ఆంధ్ర చేదోడు వాదోడుగా వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు సహకారాలతో అశ్వారావుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ అనుచరుడుగా ఎమ్మెల్యే జారే. ఆదినారాయణ ఆప్తుడుగా గ్రామపంచాయతీ మెరుగైన పాలన ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు మహిళలు అన్ని రంగాలలో రాణించాలని పిలుపు నిచ్చారు గ్రామంలో ఉన్న మహిళా మణులకు ఈరోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ సోయం ప్రసాద్ , కుంజా స్వర్ణ, గొంది కనకమ్మ,మడకం. ఆంధ్రయ, చందా అలేఖ్య, మడకం పుల్లారావు, యడ్లపల్లి రమేష్, పాయం జగదంబ, కుంజా రాంబాబు, కంప్యూటర్ ఆపరేటర్ చాత్రాతి వరుణ్ మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు




# మహిళా పోలీసుల పాత్ర కీలకం

- **మహిళా దినోత్సవం సందర్భంగా ఘన సన్మానం**
- **ఎస్‌హెచ్ఓ తాజుద్దీన్**

**గోవిందరావుపేట, మార్చి 8( డి డి 9 వార్త )**

శాంతి భద్రతల పరిరక్షణలో మహిళా పోలీసుల పాత్ర ఎంతో కీలకమని పస్రా,పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ తాజుద్దీన్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మహిళా పోలీస్ సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆదివారం ఎస్‌హెచ్ఓ తాజుద్దీన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించి మహిళా పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఓ తాజుద్దీన్ మాట్లాడుతూ మహిళా పోలీస్ సిబ్బంది చట్ట పరిరక్షణలో, శాంతి భద్రతలను కాపాడడంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని అన్నారు. సమాజంలో మహిళల భద్రత కోసం వారు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుతం మహిళలు ప్రతి రంగంలో ముందుకు సాగుతూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని, పోలీస్ శాఖలో మహిళల సేవలు ఎంతో విలువైనవని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని మహిళా పోలీసులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పి ఎస్ ఐ ఆంజనేయులు, ఎస్ ఐ నాగరాజు , ఎస్ ఐ వీరయ్య, నరోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మహాదేవపూర్ ప్రజలకు పోలీసుల హెచ్చరిక.

**మహాదేవపూర్ మార్చి 8 ( డిడి 9వార్త )**

మహాదేవపూర్ పరిధిలోని ఇసుక క్వారీలకు సంబంధించిన వ్యవహారంపై పోలీస్ శాఖ గ్రామ ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. మహాదేవపూర్ పరిధిలో రెండు గ్రూపుల మధ్య వివాదం కారణంగా ఇసుక క్వారీలలో ఎవరూ తమ సొంత నిర్ణయాలతో ఇసుక లారీలపై టార్పాలిన్ (పట్టా) లెవలింగ్ చేయడం పూర్తిగా నిషేధించబడినదని మహాదేవపూర్ ఎస్సై పవన్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమించి ఎవరైనా లారీలపై లెవలింగ్ చేసి డ్రైవర్ల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



ప్రజలు ఎవరూ కూడా సొంత నిర్ణయాలకు పోకుండా చట్టాన్ని గౌరవించి సహకరించాలని ఆయన కోరారు



## పీజీ కాలేజ్ వాకర్స్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సేవలకు ఘన సన్మానం
- సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అమూల్యం

**పెద్దపల్లి బ్యూరో, మార్చి 08 (డిడి9 వార్త):**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీజీ కాలేజ్ వాకర్స్ ఆధ్వర్యంలో మహిళలకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాకర్స్ సభ్యులు మాట్లాడుతూ... మహిళలు కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధిలో కూడా కీలకమైన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. సమాజంలో మహిళలకు గౌరవం, ప్రాధాన్యత మరింత పెరగాలని వారు ఆకాంక్షించారు. మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహిళలు తమ అనుభవాలను పంచుకుంటూ సమాజంలో మహిళల ఎదుగుదలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. మహిళల సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు అభిప్రాయపడ్డారు. పీజీ కాలేజ్ వాకర్స్ సభ్యులు మహిళల సేవలను కొనియాడుతూ వారి కృషి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. మహిళలు ధైర్యం, పట్టుదలతో ముందుకు సాగితే కుటుంబం మాత్రమే కాకుండా సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు, మహిళలు, స్థానిక ప్రముఖులు పాల్గొని మహిళా దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. మహిళల సేవలను గుర్తించి సన్మానించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.



## సారు ఇటువైపు చూడు పాతఎన్‌హెచ్–7

- షాద్‌నగర్‌లో రోడ్డుపై ఆక్రమణలు వ్యాపారాలు
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు టిఫిన్ సెంటర్లో జ్యూస్,దుకాణం ఎదురుగా ట్రాఫిక్ జామ్

**రంగారెడ్డి డిడి9వార్త(మార్చి08) :**

షాద్‌నగర్ పట్టణంలో పాత ఎన్‌హెచ్-7 రహదారి విస్తరణ చేసినప్పటికీ ప్రజలకు ప్రయోజనం లేకుండా పోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.రహదారిని విస్తరించిన తరువాత కూడా కొందరు దుకాణదారులు రోడ్డును ఆక్రమించి తమ వ్యాపారాలు నిర్వహించడం వల్ల వాహనదారులు,పాదచారులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారు. ప్రత్యేకంగా తిరుమల జ్యూస్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో పండ్ల వ్యాపారులు మరియు కొంతమంది దుకాణాల యజమానులు రోడ్డుపై కార్లు, బైకులు, ఆటోలు పార్కింగ్ చేసి వ్యాపారాలు సాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనాలు సరిగ్గా వెళ్లలేక ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.ఈ విషయాన్ని ప్రశ్నించిన వాహనదారులతో కొందరు వ్యాపారులు దురుసుగా ప్రవర్తిస్తూ దౌర్జన్యాలకు దిగుతున్నారని కూడా పలువురు పేర్కొంటున్నారు. "రోడ్డు మీద వాహనాలు నిలిపితే ఎలా వెళ్లాలి?" అని అడిగితే "మా ఇష్టం... మమ్మల్ని అడిగే అధికారులు ఎవరున్నారు?"అంటూ గొడవలకు దిగుతున్నారని స్థానికులు అంటున్నారు.రోడ్డు విస్తరణ చేసినప్పటికీ దానిని పార్కింగ్ స్థలంగా మార్చడం వల్ల ప్రజలకు ప్రయోజనం లేకుండా పోయిందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న షాద్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు మరియు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని వారు కోరుతున్నారు. రోడ్డుపై అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించి, రహదారిని ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే జరిమానాలు విధించాలని పట్టణ వాహనదారులు మరియు పాదచారులు డిమాండ్ చేస్తున్నారు.



# మహిళలకు ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబన కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రులు సీతక్క, దామోదర
- మహిళల శక్తి సమాజాన్ని మార్చగలదు మంత్రి సీతక్క

**డీ డీ 9 వార్త, ములుగు బ్యూరో :**



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని కుమరం భీం ఆదివాసి భవన్‌లో ఆదివారం ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు దామోదర రాజనర్సింహ మరియు సీతక్క ముఖ్య అతిథులుగా హాజరై పలు మహిళా సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ డయాగ్నస్టిక్స్ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు 30 రకాల ఉచిత ఆరోగ్య పరీక్షలను మంత్రులు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మంత్రులు స్వయంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అలాగే బస్ స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో శిశువులకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఈ గదుల నమూనాను మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం కౌమార బాలికలకు హెచ్‌పీవీ టీకా వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడ బాలికలకు ధైర్యం చెప్పి మంత్రులు స్వయంగా టీకాలు వేయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ఆన్‌లైన్ పోర్టల్ "మహిళా వసతి" ను మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ ఆవిష్కరించారు. అలాగే "ఇందిరా మహిళా శక్తి అచీవ్మెంట్స్" పుస్తకాన్ని మంత్రి సీతక్క విడుదల చేశారు. కార్యక్రమంలోవినూత్నవ్యాపారాలతోరాణిస్తున్న 31 మంది మహిళలను మంత్రి సీతక్క ఘనంగా సన్మానించి, వారికి రూ.25,000 చొప్పున ఆర్థిక ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళలే సమాజానికి మూలాధారం అని పేర్కొన్నారు.ఒకప్పుడు మహిళలకుఓటుహక్కు కూడా లేకపోయినా పోరాటాల ద్వారా తమ హక్కులను సాధించుకున్నారని తెలిపారు. అవకాశం ఇస్తే మహిళలు పంట పొలాల నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. పంట పొలాల్లో 80 శాతం పనిని మహిళలే చేస్తారని పేర్కొంటూ, ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. మహిళలు అందరి గురించి ఆలోచిస్తారని కానీ తమ ఆరోగ్యం గురించి పట్టించుకునే సమయం ఉండదని, అందుకే మహిళా సంఘాల సభ్యులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి వివరించారు. ముందుగానే వ్యాధులను గుర్తించి వైద్య సదుపాయాలు అందించడమే లక్ష్యమని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా లోన్లు అందించి పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. హైటెక్ సిటీలో వందల కోట్ల విలువైన మార్కెట్‌ను మహిళా సంఘాలకు అప్పగించినట్లు చెప్పారు. మహిళలు ఇప్పపువ్వు లడ్డూల నుంచి రైస్ మిల్లుల నిర్వహణ, సోలార్ ప్లాంట్ల వరకు వ్యాపారాల్లో ముందుకు వస్తున్నారని తెలిపారు. మేడారం జాతరలో 565 మహిళా సంఘాలకు దుకాణాలు ఏర్పాటు చేసి, రూ.6 కోట్ల పెట్టుబడితో రూ.3.5 కోట్లకు పైగా లాభాలు సాధించారని మంత్రి తెలిపారు. ఒకప్పుడు చిన్నచిన్న వ్యాపారాలు చేసిన మహిళలు ఇప్పుడు సంపద సృష్టికర్తలుగా ఎదుగుతున్నారని అన్నారు. మహిళలు బాల్య వివాహాలను అడ్డుకోవాలని, అమ్మాయిలకు న్యాయం జరిగేలా మహిళా సంఘాలు ముందుండాలని పిలుపునిచ్చారు. వచ్చే మహిళా దినోత్సవానికి వేలాది మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడం సమాజ అభివృద్ధికి కీలకమని అన్నారు. మహిళా సంఘాలపై బ్యాంకులకు ఎంతో విశ్వాసముందని, వారు తీసుకున్న రుణాలను 98 శాతం తిరిగి చెల్లిస్తున్నారని తెలిపారు. మహిళల ఆరోగ్యం బాగుండాలని ప్రభుత్వం భావిస్తోందని, అందుకే స్వయం సహాయక సంఘాల సభ్యులందరికీ 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వచ్చే మూడు నెలల్లో ఈ పరీక్షలను పూర్తిచేసి, మహిళలకు డిజిటల్ ఆరోగ్య కార్డులను అందజేస్తామని వెల్లడించారు. అమ్మాయిల బంగారు భవిష్యత్తు కోసం హెచ్‌పీవీ టీకాను అందిస్తున్నామని, ప్రతి గ్రామంలో మహిళా సంఘాలు ఈ టీకా గురించి అవగాహన కల్పించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, క్రిస్టినా చోంగ్తు, అనితా రామచంద్రన్, దివ్య దేవరాజన్, శృతి ఓజా, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరేంద్ర కుమార్, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సత్సంగమంలో టాపర్ బండి జ్యోతి రంజన్

**బోనకల్,మార్చి08,(డీడీ9 వార్త):**



పల్లెప్రపంచం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చొప్పకట్లపాలెం గ్రామంలో మూడు రోజుల పాటు జరిగిన సత్సంగమం కార్యక్రమంలో బండి జ్యోతి రంజన్ టాపర్ గా నిలిచినట్లు సంస్థ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. సత్సంగమం కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం రాత్రి ఎవరు బాగా అవగాహన చేసుకున్నారనేదానిపై క్విజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అవగాహన చేసుకుని మంచిగా ప్రజెంట్ చేసిన బండి జ్యోతి రంజన్ ప్రథమ బహుమతి సాధించాడు. ప్రశ్నలుజవాబులు విభాగంలో దారెల్లి దీక్షిత, రచ్చా రాఘవేంద్రలు ప్రథములుగా నిలిచారు. మూడు రోజుల కార్యక్రమంపై ఉపన్యాసం చెప్పినవారిలో యడ్లపల్లి క్రాంతిశ్రీ ప్రథమ స్థానంలో నిలిచింది. వీరికి పల్లెప్రపంచం ఫౌండేషన్ తరపున బుక్స్ బహుమతిగా అందిస్తారని తెలిపారు. మూడు రోజుల పాటు సత్సంగమంలో పార్టిసిపేట్ చేసినవారిలో పెద్దలు మినహాయించి విద్యార్థులు అందరికీ బహుమతి ఇస్తామని మూడవ వార్డు సభ్యులు బోయినపల్లి పున్నయ్య ప్రకటించారు. కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పల్లా కొండలరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిరంతరాయంగా జరిపేందుకు కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు, చొప్పకట్లపాలెం సర్పంచ్ కాటేపల్లి అశ్విని మాట్లాడుతూ సత్సంగమం నిరంతరం జరిగేందుకు తనవంతు సహకారం అందించనున్నట్లు తెలిపారు. వార్డు సభ్యులు బోయినపల్లి పున్నయ్య, కొండేటి అప్పారావు, భక్తాంజనేయస్వామి దేవాలయం పూజారి వజ్రాల రాధాకృష్ణ, కావూరి నరసింహ రావు, ఇమ్మడి వెంకటేశ్వర్లు, దారెల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.





## మహిళల ఐక్యతకు ప్రతీకగా ఇబ్రాహీంపూర్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

**జనగామ మార్చి 8 (డిడి 9 వార్త ) బ్యూరో**

జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఇబ్రాహీంపూర్ గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, యువతులు ఒకేచోట చేరి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ మహిళల ఐక్యత, సాధికారత, సమాజంలో వారి పాత్రపై చర్చించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ కుటుంబం, సమాజం అభివృద్ధికి కీలకంగా నిలుస్తున్నారని పలువురు పేర్కొన్నారు. మహిళలకు విద్య, ఉపాధి అవకాశాలు పెరగడం వల్ల వారు మరింత శక్తివంతంగా మారుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు ఉప్పొజు మంజుల నోముల యాదలక్ష్మి నల్లా మౌనిక, రాణి, పండుగ ప్రమీల,మేడిపల్లి గీత, భార్గవి యశోద,భాగ్యలక్ష్మి,స్రవంతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు



## ఏజెన్సీలో లిక్కర్ సిండికేట్ల ఆగడాలు – బెల్ట్ షాపుల రాజ్యం,

- అధిక ధరలతో కోట్ల దందా
- ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యమా? నెలవారీ మామూళ్లతో అక్రమ వ్యాపారానికి అండా?

**గుండాల, మార్చి 8(ప్రత్యేక ప్రతినిధి):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం గుండాల గ్రామంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో లిక్కర్ సిండికేట్లు అక్రమ మద్యం వ్యాపారాన్ని బహిరంగంగానే సాగిస్తున్నాయనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతితో నడిచే వైన్ షాపుల్లో వినియోగదారులు అడిగిన మద్యం బ్రాండ్లు దొరకని పరిస్థితి నెలకొనగా, గ్రామాల్లో నడుస్తున్న బెల్ట్ షాపుల్లో మాత్రం అన్ని రకాల మద్యం సులభంగా లభిస్తుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. స్థానికుల ప్రకారం వైన్ షాపుల్లో ఉద్దేశపూర్వకంగా కొరత సృష్టించి అదే మద్యం బెల్ట్ షాపులకు సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ బెల్ట్ షాపుల్లో ప్రతి మద్యం సీసాపై ₹25 వరకు అదనంగా వసూలు చేస్తూ వినియోగదారులను దోచుకుంటున్నారని చెబుతున్నారు. రోజుకు వందల సంఖ్యలో మద్యం సీసాలు విక్రయిస్తూ నెలకు లక్షల రూపాయల అక్రమ లాభాలు ఆర్జిస్తున్నట్లు సమాచారం. ఏజెన్సీ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు నిషేధితమైనప్పటికీ, గుండాల మండలంలోని పలు గ్రామాల్లో అవి బహిరంగంగానే నడుస్తున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. లిక్కర్ సిండికేట్లు గ్రామాల వారీగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసి బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలను నియంత్రిస్తున్నాయని సమాచారం. ఈ వ్యవస్థ ద్వారా కోట్ల రూపాయల అక్రమ దందా జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ అక్రమ వ్యాపారంపై పలుమార్లు ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలవారీ మామూళ్లతో అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో బెల్ట్ షాపులు మరింత ధైర్యంగా తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. గ్రామాల్లో మద్యం సులభంగా అందుబాటులో ఉండటంతో యువత దానికి బానిసలవుతున్నారని, కుటుంబాల్లో ఆర్థిక సమస్యలు పెరుగుతున్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు మద్యం విక్రయాలు




పెరగడం వల్ల గ్రామాల్లో సామాజిక సమస్యలు కూడా అధికమవుతున్నాయని చెబుతున్నారు. ఇక వైన్ షాపుల్లో ప్రభుత్వ ధరలకు మద్యం అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు తప్పనిసరిగా బెల్ట్ షాపులనే ఆశ్రయించాల్సి వస్తోంది. అక్కడ అయితే ప్రభుత్వ ధరలకంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయాలు జరుగుతుండటం ప్రజలకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గుండాల మండలంలోని బెల్ట్ షాపులపై ప్రత్యేక దాడులు నిర్వహించాలని, అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే వైన్ షాపుల్లో ప్రభుత్వ ధరలకు మద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లిక్కర్ సిండికేట్ల అక్రమ దందాపై ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా? లేక ఇదే పరిస్థితి కొనసాగుతుందా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

# గ్రామంలోనే ప్రజావాణి కార్యక్రమం

- ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న




**గోవిందరావుపేట, మార్చి 8( డి డి 9 వార్త)**

మండలం లోని గాంధీనగర్ గ్రామంలో ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు గ్రామ సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న, ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇక నుంచి ప్రతి సోమవారం గ్రామంలోనే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్తులు తమ సమస్యలను నేరుగా గ్రామపంచాయతీ వద్ద తెలియజేసే అవకాశం కల్పించబడుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. మండల, జిల్లా స్థాయి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ అభివృద్ధి మరియు ప్రజల సంక్షేమం కోసం ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతుందని సర్పంచ్ అన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను తెలియజేయాలని సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న కోరారు. ప్రజల సమస్యలకు గ్రామంలోనే పరిష్కారం అందించడం గ్రామపంచాయతీ లక్ష్యమని స్పష్టం చేశారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ మార్చి 8 (డిడి 9 వార్త )**

వైద్యాధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉంచాలని రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి సరైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రతీ వార్డ్ పరిశుభ్రంగా ఉండాలని, సరిపడా మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. హాస్పిటల్ కి వచ్చిన రోగులకు సరైన వైద్యం అందుతుందా?. సమయానికి డాక్టర్ లు అందుబాటులో ఉంటున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఎక్స్ రే సేవలను వెంటనే, డయాలసిస్ సేవలను వారం రోజుల్లో అందుబాటులోకి తీసుక రావాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రి ని పరిశీలించి ఇప్పటివరకు ఎంత మేరకు నిర్మాణ పనులు అయ్యాయి? ఇంకా ఏఏ పనులు పెండింగ్ లో ఉన్నాయనే వివరాలను సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరగాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. మున్సిపల్ కమిషనర్ కార్యాలయాన్ని సందర్శించి ప్రతీ గది నిర్వహణను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి కార్యాలయ నిర్వహణ మీద,పరిసరాల పరిశుభ్రత మీద మున్సిపల్ కమిషనర్ సూచనలు చేశారు. అనంతరం రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. మధ్యాహ్న భోజన వసతి తీరును అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఆయన దిశా నిర్దేశం చేసి మంచి ఫలితాలు సాధించాలని, ఇందుకు ఉపాధ్యాయులను విద్యార్థినులకు గైడ్ చేయాలని ఆదేశించారు.



# గ్రామంలో అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తి పోలీసులకు అప్పగింత

**బోనకల్,మార్చి08,(డీడీ9 వార్త):**



మండలంలోని పరిధిలోని గోవిందాపురం(ఎల్),పెద్దబీరవల్లి గ్రామాల్లో రాత్రి 7గంటల సమయంలో అనుమానితుడిగా కనిపించిన ఓ వ్యక్తిని గ్రామ వాసులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే శనివారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించగా అతన్ని గ్రామస్థులు వెంబడించారు.దీంతో ఆ వ్యక్తిని పట్టుకొని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్కు తరలించారు, ఎస్సై పొదిలి వెంకన్న విచారణ జరపగా పేరు షాబాజ్ హెచ్చైడి అని చెబుతున్నట్లు తెలిపారు,ఆ వ్యక్తిని విచారించిన అనంతరం అన్నం ఫౌండేషన్ కి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు,ఇదిలా ఉండగా గోవిందాపురం ఎల్ గ్రామస్తులు మాత్రం అతడితో పాటు మరో నలుగురు వ్యక్తులు వచ్చి గ్రామంలో సంచరించినట్లు తెలుపుతూ,వారు ప్రస్తుతం పరారైనట్లు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.గ్రామంలో పోలీసులు మరింత భద్రత పెంచాలని అధికారులను కోరారు.




# మహిళా దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు

- శ్రీ విశ్వ జ్యోతి స్కూల్ ఆదర్శ కార్యక్రమం

**మార్చి 08 డిడి 9 వార్త వెంకటాపురం.**

ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో ఉన్న విద్యాసంస్థ శ్రీ విశ్వ జ్యోతి స్కూల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్కూల్ మహిళా ఉపాధ్యాయ సిబ్బంది సాటి మహిళలైన వితంతువులు, వృద్ధులు 50 మందికి చీరలు, హాస్పిటల్ లో ఉన్న పలువురికి పండ్లు పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో భాగంగా బెస్తగూడెం, బీసీ మర్రిగూడెం, నెలారుపేట, వెంకటాపురం, చొక్కాల,వి ఆర్ కేపురం గ్రామాలలోని పలువురు వృద్ధులు మరియు వితంతువులకు చీరలు అందజేశారు. అనంతరం వెంకటాపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా శ్రీ విశ్వ జ్యోతి స్కూలు ప్రిన్సిపాల్ ఎస్. రామకృష్ణ మాట్లాడుతూ మహిళా దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, తమ పాఠశాలలోని ఉపాధ్యాయులు దయా హృదయం కలిగి సమాజంలో సాటి మహిళలకు సహాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. వారికి గౌరవం, సమాన హక్కులు, ప్రోత్సాహం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన తెలిపారు. మహిళలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా ప్రధాన శక్తిగా నిలుస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమాలపై స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా, సమాజానికి మేలు చేసే కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీ విశ్వ జ్యోతి స్కూల్ యాజమాన్యానికి, వారి సిబ్బందికి, కృతజ్ఞతలు తెలిపారు. స్కూల్లో పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. విద్యాభివృద్ధి మరియు సామాజిక బాధ్యతను ముందుంచుకొని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీ విశ్వ జ్యోతి స్కూల్ నిజంగా ఆదర్శ విద్యాసంస్థగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామకృష్ణ ఉపాధ్యాయ సిబ్బంది థామస్,రాధిక, దుర్గాపూర్ణిమ, మాధురి , సంయుక్త,





కళ్యాణి, మనోజ్ఞ , లలిత, శరణ్య, శ్రావణి, మధుప్రియ, స్రవంతి ఇతర సిబ్బంది వినోద్, సాయి, ముత్యావతి, రవి పేరెంట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మహిళలే మహారాణులు...

- "మహిళలు ఆత్మగౌవరంతో జీవించడమే వారికి నిజమైన సాధికారత".
- "ముఖ్యంగా బాల్య వివాహాలను నిర్మూలిస్తే మహిళల హక్కులను కాపాడినట్లే".
- జిల్లా సంక్షేమ అధికారిణి EP ప్రేమలత.

**ఫిబ్రవరి 08 డిడి 9 వార్త వెంకటాపురం.**

వెంకటాపురంలో ఉన్న కాఫీడ్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి సంస్థ డైరెక్టర్ బ్రదర్ లూర్దురాజ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా హక్కులపై సామాజిక చైతన్యం కోసం స్థానిక వెంకటాపురం తహశీల్దారు గారి కార్యాలయం నుండి CAFED సంస్థ సమావేశ వేదిక వరకు 500 మంది మహిళలతో ప్రత్యేకంగా ర్యాలీ తీయడం జరిగింది. అనంతరం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ములుగు జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి E.P. ప్రేమలత మాట్లాడుతూ "బాల్య వివాహ ముక్త్ భారత్" నినాదంతో భారత ప్రభుత్వం 2030 నాటికి బాల్య వివాహాలు లేని భారత దేశ నిర్మాణమే ధైర్యంగా ముందుకు వెళ్తుందని, దానికి అనుగుణంగా మనమంతా బాల్య వివాహ రహిత ములుగు జిల్లాను రూపొందించడం లో భాగస్వాములం కావాలని పిలుపునిచ్చారు. వివాహాలను నిర్మూలిస్తే మహిళల హక్కులను కాపాడినట్లేనని అన్నారు. అనంతరం తాను మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను నిరూపిస్తూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కుటుంబం నుండి సమాజం వరకు ప్రతి రంగంలో మహిళలు ధైర్యం, కృషి, నాయకత్వంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. మహిళలకు విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబన కల్పించడమే సమాజ పురోగతికి ప్రధాన ఆధారం అని ఆమె పేర్కొన్నారు. మహిళల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు మరింత శక్తివంతంగా ఎదగాలని ఆమె సూచించారు. అదేవిధంగా సభకు అధ్యక్షత వహించిన CAFED సంస్థ డైరెక్టర్ బ్రదర్ లూర్దురాజ్ గారు మాట్లాడుతూ, మహిళా సాధికారతే సమాజ అభివృద్ధికి మూలస్తంభమని అన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి CAFED సంస్థ నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి వెంకటాపురం మరియు వాజేడు మండలాల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీల మహిళా సర్పంచులు, మాజీ మండల మహిళా ప్రజా ప్రతినిధులు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. వారు కూడా మహిళలు ఐక్యంగా ముందుకు సాగితే సమాజంలో మరింత మార్పు తీసుకురాగలమని అభిప్రాయం వ్యక్తం చేశారు. తదనం బాల్య వివాహ నిషేధ చట్టం 2006 & POCSO చట్టం 2012 లను గురించి ప్రొటెక్షన్ ఆఫీసర్ హరికృష్ణ వివరించారు. CAFED సంస్థ ఆధ్వర్యంలో గత 2 నెలలుగా వెంకటాపురం & వాజేడు మండలానుండి కుట్టు మిషన్ లో శిక్షణ పొందిన యువతులు & మహిళలకు విచ్చేసిన అతిథుల చేస్తుల మీదుగా కుట్టు మిషన్ లను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం వెంకటాపురం & వాజేడు మండలాల పరిధిలోని వివిధ గ్రామాలలో స్వచ్ఛందంగా సేవలందిస్తున్న మహిళలను CAFED సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ BLOగా అవార్డు అందుకున్న కోర్స సమ్మక్క ను ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో KGBV వెంకటాపురం పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. చివరగా ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులు మరియు పాల్గొన్న వారికి CAFED సంస్థ ఆధ్వర్యంలో జ్ఞాపికలు అందజేయడం జరిగింది. ఈ వేడుకలో స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, CDPO ముత్తమ్మ, సూపర్వైజర్ పుష్పలత, శ్యామల, KGBV టీచర్ల బృందం, సుధాకర్ లారెన్స్, CAFED సంస్థ నుండి బ్రదర్ బాబు & సిబ్బంది, CHL కేస్ వర్కర్ Y. చంటి, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా వెంకటాపురం మరియు వాజేడు మండలాలకు చెందిన సుమారు 500 కి పైగా మహిళలు & గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.








# శివనాగిరెడ్డి కిసంతాపం తెలిపిన మంత్రి పొంగులేటి సతీమణి మాధురి

- టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యులు ఉమ్మినేని కృష్ణ,
- జర్నలిస్టులు,మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ సిబ్బంది



**బోనకల్,మార్చి 08,(డీడీ9 వార్త):**


మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన గడ్డం శివనాగిరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆయన దశదినకర్మ వారి స్వగృహంలో ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి,టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యులు ఉమ్మినేని కృష్ణ, మండల కాంగ్రెస్ నాయకులు బోయినపల్లి మురళి, బంధం శ్రీనివాస రావు, సురభి నర్సింహారావు, షేక్ బాబు, తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.శివనాగిరెడ్డి చిత్రపటం వద్ద పూలు ఉంచి నివాళులర్పించారు.శివనాగిరెడ్డి సోదరులు శ్రీకాంత్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారితో పాటు ఇతర కుటుంబ సభ్యులు తండ్రి సుబ్బారెడ్డి,తల్లి వెంకటరమణమ్మ, మరదలు లాస్యశ్రీలతో మంత్రి సతీమణి మాధురి మాట్లాడారు,నాగిరెడ్డి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులు అర్పించిన వారిలో సీనియర్ జర్నలిస్టులు కె. శ్రీనివాసరెడ్డి, దువ్వా సాగర్,కూరాకుల గోపీ,క్యాంపు కార్యాలయ సిబ్బంది సురేష్,చంద్రశేఖర్,రామకృష్ణ, ప్రవీణ్, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఝాన్సీ రాజేందర్ రెడ్డి

**పాలకుర్తి మార్చి 07(డిడి 9 వార్త)**

పాలకుర్తి నియోజకవర్గంలో పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సి రాజేందర్ రెడ్డి గారు తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి మరియు వరంగల్ ప్రాంతాల్లో నిర్వహించిన పలు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. వధూవరులు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ వారి కుటుంబ సభ్యులను అభినందించారు ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు మరియు అభిమానులు పాల్గొన్నారు



# ప్రజాసేవలో సర్పంచ్ దిడ్డి మొహన్ రావుకు నీరాజనాలు

- గ్రామ అభివృద్ధే లక్ష్యంగా సేవలు చేస్తున్న సర్పంచ్
- తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- వార్డు సభ్యులకు అవగాహన కల్పిస్తూ అభివృద్ధి పనులు
- గ్రామ ప్రజల కష్టసుఖాల్లో భాగమవుతున్న సర్పంచ్ మొహన్ రావు
- కాటాపురం గ్రామంలో సర్పంచ్ పెళ్లిరోజు వేడుకలు
- పలు గ్రామాల నుంచి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమార్రి లక్ష్మణ్ బాబు
- మొహన్ రావు దంపతులను ఆశీర్వదించిన నాయకులు
- యువకుల ఆధ్వర్యంలో శాలువాతో సన్మానం
- తడిక హరీష్ నాయకత్వంలో యువత అభినందనలు

**ఏటూరునాగారం(క్రైమ్), మార్చి 08 (డీడీ9 వార్త):**

ప్రజాసేవే లక్ష్యంగా గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న కాటాపురం గ్రామ సర్పంచ్ దిడ్డి మొహన్ రావును పలువురు ప్రశంసించారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న ఆయనకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి గ్రామంలో ఉన్న పలు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, గ్రామాభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వార్డు సభ్యులకు అవగాహన కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ఆదివారం సర్పంచ్ దిడ్డి మొహన్ రావు పెళ్లిరోజు సందర్భంగా కాటాపురం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కేవలం గ్రామం నుంచే కాకుండా పరిసర ప్రాంతాల నుంచి ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమార్రి లక్ష్మణ్ బాబు పాల్గొని మొహన్ రావు దంపతులను ఆశీర్వదించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దిడ్డి మొహన్ రావు నిజమైన ప్రజాప్రతినిధిగా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. యువకుల నుంచి సన్మానం సర్పంచ్‌గా గ్రామానికి సేవలందిస్తున్న దిడ్డి మొహన్ రావు పెళ్లిరోజు సందర్భంగా యువకులు ప్రత్యేకంగా సన్మానించారు. యువ నేత తడిక హరీష్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్లూరి అనిల్, వెంకటేష్ రాజు, బందెల తిరుపతి, తడిక సాయి, మహిపతి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య ఆధ్వర్యంలో జిల్లా ఇంచార్జ్ బడే నాగజ్యోతి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు వివాహ శుభకార్యాల్లో కూడా హాజరై గ్రామ ప్రజలతో కలిసి ఆనందం పంచుకున్నారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ దిడ్డి మొహన్ రావుకు గ్రామస్తులు శుభాకాంక్షలు తెలియజేశారు.







## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ప్రతినిధులను సత్కరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..

- సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమన్న పాయం..
- మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్న ఎమ్మెల్యే.


**మణుగూరు. మార్చి 8(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మణుగూరు మండలం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మహిళలను శాలువాలతో సత్కరించారు.

ఈ సందర్భంగా మహిళల సేవలను ప్రశంసిస్తూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే పాయం తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు రావాలని, వారి అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు.మహిళల సాధికారతతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ మహిళలు విద్య, స్వయం ఉపాధి రంగాల్లో మరింత పురోగతి సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, గుట్ట మల్లారం సర్పంచ్ కారం పూజిత, కూనవరం సర్పంచ్ ఎనిక శ్వేత, బోటి గూడెం ఉప సర్పంచ్ ధనలక్ష్మి, వార్డు సభ్యులు కొలపిన్నీ మానస, కృష్ణవేణి, బుగ్గ సర్పంచ్ మాధవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోలమూరి రాజు, అబ్దుల్లా, వరలక్ష్మి, కోర్లకుంట అప్పారావు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






## చంద్రుగొండ మండలంలో విస్తృతంగా పర్యటించిన అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ....


- వివిధ శుభకార్యాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే...

**అశ్వారావుపేట:మార్చి08(డిడి 9 వార్త)**

చంద్రుగొండ మండలంబాలికుంట(గ్రామం) లో బిఆర్ఎస్ నాయకులు చింతల సుబ్బారావు ఉమా దంపతుల కుమార్తె సంజన వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.గానుగపాడు(గ్రామం)లో బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు ఉగ్గం శ్రీనివాస్ రావు కృష్ణవేణి దంపతుల కుమారుడు రాజ్ కుమార్ వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

రేపల్లెవాడ(గ్రామం)లో బూడిద రవి జయమ్మ దంపతుల కుమార్తె అనూష ఎంగేజ్మెంట్ వేడుకలో పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల BRS పార్టీ అధ్యక్షులు దారా బాబు,మాజీ జడ్పీటీసీ వెంకట రెడ్డి, రేపల్లెవాడ సర్పంచ్ ఇర్ప స్రవంతి, గానుగపాడు సొసైటీ మాజీ చైర్మన్ చెవుల చందర్ రావు,నల్లమోతు వెంకటనారాయణ, బెండాలపాడు ఉప సర్పంచ్ బానోత్ బాలు,సురా వెంకటేశ్వర్లు,సత్తి నాగేశ్వరరావు,భూపతి రమేష్,మంద అనిల్, లావుడ్య రమేష్,కేలోతు శ్రీను,బాదుషా,సైదులు,బాబురావు, ఆంగోతు లక్ష్మణ్, మద్దిరాల పిచ్చయ్య,బత్తుల నాని,చల్ల రంగ,బోడా బాబురావు,కొదుమూరి శ్రీనివాస్ రావు,రాజ్ కుమార్,నాగేశ్వరరావు,కృష్ణయ్య,సత్తి సుబ్బయ్య,ఇనుముల శ్రీను,స్వామి,కన్నయ్య, పాపారావు,రాజు,హరి,సత్యనారాయణ,రాజు, తదితరులు పాల్గొన్నారు.









## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

- ఎంపీడీఓ,సర్పంచ్,పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సన్మానించిన నాయకులు

**బోనకల్,మార్చి08,(డీడీ9 వార్త):**

అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని బోనకల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం నందు అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు,ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతిని,గ్రామ పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరిని శాలువాతో ఘనంగా సన్మానించి పూల బుకే అందజేశారు.అనంతరం సర్పంచ్,ఉప సర్పంచ్ బానోతు కొండ జ్యోతి,గ్రామ పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి,బానోతు లక్ష్మి కలసి మండల పరిషత్ అభివృద్ధి అధికారిని ఆర్ రమాదేవిని శాలువాతో ఘనంగా సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు అందజేశారు.ఈ సంధర్భంగా ఉప సర్పంచ్ కొండా మాట్లాడుతూ మహిళలు సమాజానికి ఆదర్శమని,వారి సేవలు ఎంతో గొప్పవని ,అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా కష్టపడి సాధిస్తున్నారు అని కొనియాడారు, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను సన్మానించిన వారిలో గుండపనేని సుధాకర్ రావు,తేళ్లూరి రమేష్,గాలి దుర్గారావు,గుగులోతు నాగేశ్వరరావు,తెల్లాకుల శ్రీనివాసరావు,చిట్టోజు శ్రీనివాస్,గుగులోతు రమేష్, తోటపల్లి స్వామి,మోర్ల వంశీ, అంతటి రవి ప్రసాద్, ఒరుగు నరసింహారావు, వార్డు నెంబర్లు ఉప్పర శ్రీను, అంతటి శ్రీను, ఎస్ కే మీరా సాహెబ్ తదితరులు సన్మానించారు.



## అధైర్యా పడొద్దు ప్రతినిరుపేదలకు అండగా ఉంటాము.

**ఫిబ్రవరి 08 డిడి 9 వార్త వెంకటాపురం.**

ములుగు నియోజకవర్గ మహిళ మణులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ.. వీరభద్రవరం గ్రామం వెంకటాపురం మండలం ములుగు జిల్లా లోని అనారోగ్యం తో బాధపడుతున్న లంజపల్లి లాలమ్మ ను పరామర్శించి ఆరోగ్య ఖర్చుల నిమత్తం 3000 వేల రూపాయలు. అందజేసి మానవత్వం చాటుకున్న జాతీయ బీసీ సంక్షేమ సంగం ములుగు జిల్లా ఉపాధ్యక్షులు మంచర్ల నాగేశ్వరావు. ములుగు జిల్లా కార్యదర్శి బట్ట నాగేందర్. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోలం హోంపతి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీరుపేద కుటుంబాలకు గ్రామస్తులందరు ఆర్థికపరంగా అండగా నిలవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యూత్ సభ్యులు.సోలం సుధాకర్, మునిగేల హారిక్షేత్రం.బట్ట నారాయణ. బట్ట పురుషోత్తం. సోలం సతీష్.పొనగంటి కృష్ణారావు. పోడెం సురేష్. ఇండ్ల శివకుమార్.మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని అభినందించారు.





## సమాజ అభివృద్ధి లో మహిళల పాత్ర కీలకం

- ఎస్పీ సంకీర్త్

**భూపాలపల్లి మార్చి 8 ( డిడి 9వార్త )**

కుటుంబం తో పాటు సమాజ అభివృద్ధి లో మహిళల పాత్ర కీలకమైనదని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో మహిళా దినోత్సవ కార్యక్రమం ఆదివారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల పాత్ర సమాజ అభివృద్ధిలో ఎంతో ముఖ్యమని, మహిళలు ధైర్యంగా ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని తెలిపారు. ధైర్య సాహసాలకు ప్రతీకలైన రాణి రుద్రమదేవి, సమ్మక్క-సారలమ్మ, జాన్సీ లక్ష్మీబాయి వంటి మహనీయ మహిళలను స్మరించుకున్నారు. వారి త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. మహిళలు విద్య, ఉపాధి, పరిపాలన, క్రీడలు తదితర రంగాల్లో పురోగతి సాధిస్తూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. మహిళల భద్రత మరియు సాధికారత కోసం ప్రభుత్వం, పోలీస్ శాఖతో పాటు సమాజం మొత్తం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని సూచించారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ చైతన్యంతో ముందుకు రావాలని అన్నారు. అనంతరం మహిళా ఎస్ఐలు కేక్ కట్ చేసి జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, భూపాలపల్లి సీఐ నరేష్, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన శారదా మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవం

- హాజరైన ఖాసీందేవ్ పేట్ సర్పంచ్ భూక్య నిరోషా అమర్ సింగ్

**డీ డీ 9 వార్త, ములుగు బ్యూరో :**

ములుగు మండలంలోని నూతన హాస్పిటల్ ప్రారంభోత్సవానికి వెళ్లి డాక్టర్ పోరిక ప్రశాంత్ నాయక్ గారికి అభినందనలు తెలుపుతూ ములుగు జిల్లాలో గిరిజన ప్రాంతంలో ఉన్న వారి కోసం 24 గంటల ఎమర్జెన్సీ సర్వీస్ సేవలు అందించే విధంగా ప్రారంభించినటువంటి మీకు ధన్యవాదాలు తెలుపుకుంటూ ఎందుకంటే వాజేడు వెంకటాపురం నుండి హన్మకొండ వెళ్లే వరకు ఎంతో మంది ప్రాణాలు ఎమర్జెన్సీ సర్వీస్ లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు ములుగులో ఏర్పరచినటువంటి ఈ ఆసుపత్రి ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుకుంటున్నాం.



# తెలంగాణ కుంభమేళా మేడారం... అసౌకర్యాల నడుమ వెలవెలబోతుందా...!!

- జాతర కోసమే మేడారమా... ఆ తర్వాత పట్టించుకోరా అధికారులు...?
- కనీస అవసరాలు లేక అల్లాడుతున్న భక్తులు...!!
- మేడారం భక్తులను మరిచిపోయారా అధికారులు...?
- జంపన్న వాగులో నీళ్లు లేక పుణ్యస్నానాలకు ఇబ్బందులు...!!
- తాగునీటి కోసం భక్తుల గోస...!!

**ఏటూరునాగారం క్రైమ్ | డీడీ9 వార్త**



తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర జరిగే మేడారం ప్రస్తుతం కనీస సౌకర్యాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జాతర సమయంలో భారీగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పే అధికారులు, జాతర అనంతరం మాత్రం మేడారం వైపు చూడటం మానేశారనే ఆరోపణలు భక్తుల నుంచి వినిపిస్తున్నాయి. జాతర సమయంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పిన అధికారులు, ప్రస్తుతం ఆ పనులను అరకొరగా వదిలేశారనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా తాగునీరు, పుణ్యస్నానాల కోసం నీటి సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు అల్లాడుతున్నారు.

**జంపన్న వాగులో నీళ్లు లేక పుణ్యస్నానాలకు కష్టాలు**

మేడారం సమీపంలోని పవిత్రమైన జంపన్న వాగు లో నీటి లేకపోవడం భక్తులకు తీవ్ర సమస్యగా మారింది. వేలాది మంది భక్తులు పుణ్యస్నానాల కోసం వాగు వద్దకు చేరుకున్నప్పటికీ అక్కడ నీటి సౌకర్యం లేక నిరాశ చెందుతున్నారు. కనీసం మోటార్ల ద్వారా అయినా నీటిని అందించే ఏర్పాట్లు చేయలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తాగునీటి కోసం భక్తుల గోస**

మేడారం ప్రాంతంలో తాగునీటి సౌకర్యం కూడా సరైన స్థాయిలో లేకపోవడం మరో సమస్యగా మారింది. గద్దెల వద్ద మొక్కులు సమర్పించేందుకు వచ్చిన భక్తులకు తాగునీటి ఏర్పాట్లు లేకపోవడంతో బయట నుంచి నీళ్లు కొనుక్కొని దాహం తీర్చుకోవాల్సి వస్తోంది. చిన్న పిల్లలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ఆదివారం మినీ జాతరలా మేడారం**

ప్రతీ ఆదివారం మేడారం ప్రాంతం మినీ జాతరను తలపించేలా మారుతోంది. పొరుగున ఉన్న రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు వాహనాల్లో తరలివస్తున్నారు. నిలువెత్తు బంగారం తులాభారం, మొక్కులు సమర్పించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు గద్దెల వద్దకు చేరుకుంటున్నారు. అయితే అక్కడ కూడా కనీస సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిలకలగుట్ట రోడ్, ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో చెట్ల కింద వంటావార్పు చేసుకుంటూ భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు.

**అధికారులు వెంటనే స్పందించాలి**

జాతర సమయంలో మాత్రమే కాకుండా ఏడాది పొడవునా మేడారం ప్రాంతానికి భక్తులు వస్తుంటారు. అలాంటి ప్రదేశంలో తాగునీరు, పుణ్యస్నానాల కోసం నీరు, ఇతర కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని భక్తులు చెబుతున్నారు. వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.






# గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరి

- మేయర్ మహంకాళి స్వామి
- గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభం
- అనంతరం వరల్డ్ వైడ్ బ్లడ్ డ్రైవ్ ప్రారంభించిన మేయర్

**పెద్దపల్లి బ్యూరో, మార్చి 08 (డిడి9 వార్త):**







రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ప్రాణాంతక గర్భాశయ క్యాన్సర్ నివారణకై 14 సంవత్సరాల వయస్సు గల బాలికలు తప్పనిసరిగా హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోనా వైరస్) వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. ఆదివారం గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో రీజనల్ మెడికల్ ఆఫీసర్ కృపాభాయ్‌తో కలిసి హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం లక్షలాది మంది మహిళలు గర్భాశయ క్యాన్సర్ బారిన పడుతున్న నేపథ్యంలో నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలికల పాఠశాలలు, ఇతర విద్యాసంస్థల్లో విద్యార్థినులకు మరియు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి 14 సంవత్సరాల వయస్సు గల ప్రతి బాలికకు వ్యాక్సినేషన్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. మహిళా దినోత్సవం రోజున ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాళ్ సింగ్, స్థానిక కార్పొరేటర్ సాగి సంతోష్ రావు, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో ఇంటర్నేషనల్ వి లవ్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 895వ వరల్డ్ వైడ్ బ్లడ్ డ్రైవ్ కార్యక్రమాన్ని కూడా మేయర్ మహంకాళి స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వి లవ్ యు ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సామాజిక సేవలను కొనియాడారు. రక్తదాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో 50 మంది దాతలు రక్తదానం చేశారు. పలువురు కార్పొరేటర్లు, స్వచ్ఛంద సంస్థ జిల్లా ప్రతినిధి ప్రేమ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి నియోజకవర్గం వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి.

**డిడి9వార్త / పెద్దపల్లి మర్చి 9:**

ఈరోజు పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన పలు వివాహ వేడుకల్లో "మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి".పాల్గొన్నారు. కరీంనగర్, చొప్పదండి,కాట్నపల్లి,నర్సాయిపల్లి,సుల్తానాబాద్,గుంపులు, మీర్జంపేట్, ఉప్పరపల్లి, పెద్దపల్లి, గొల్లపల్లి, కొదురుపాక, కాసులపల్లి ప్రాంతాల్లో నిర్వహించిన వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన వధూవరులు ఆనందంగా, ఆరోగ్యంగా ఉండి కుటుంబ సమేతంగా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. వారి వెంట స్థానికులు బి ఆర్ ఎస్ నాయకులు ఉన్నారు.



# మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఘన సత్కారం

- వెన్నంపల్లి గ్రామంలో శాలువాలతో మహిళలను సత్కరించిన సర్పంచ్ కలవేన రమేష్

**పెద్దపల్లి బ్యూరో, మార్చి 08 (డిడి9 వార్త):**

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు ఘన సత్కారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కలవేన రమేష్ ఆధ్వర్యంలో మహిళలను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కలవేన రమేష్ మాట్లాడుతూ... మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. మహిళలు లేకపోతే ఈ సృష్టే లేదని ఆయన తెలిపారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈర్ల ప్రవీణ్, పులి జనార్దన్, ఈర్ల కోమలత తదితరులు పాల్గొన్నారు.




# లింగారెడ్డి గూడ గ్రామంలో ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం..

- గ్రామంలోని మహిళలను సన్మానించిన మాజీ సర్పంచ్ భీష్వ మాధవి రామకృష్ణ
- మహిళా సంఘాలకు కుర్చీలను బహుకరించిన వార్డు సభ్యులు రంగంపల్లి శశాంక్ గౌడ్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి డిడి9వార్త(మార్చి08):::**

జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని లింగారెడ్డి గూడ గ్రామంలోనీ మహిళా మణులను మాజీ సర్పంచ్ భీశ్వ మాధవి గారు ఘనంగా సన్మానించడం జరిగింది. మహిళలందరూ కలిసికట్టుగా ఉంటూ ఆత్మ సైర్యంతో మనోధైర్యంతో ముందుకు వెళ్లాలని అన్ని రంగాలలో ముందంజలో ఉండాలని తోటి మహిళలకు సూచించడం జరిగింది. జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని గ్రామపంచాయతీ వార్డు సభ్యులు రంగంపల్లి శశాంక్ గౌడ్ మహిళల కోరిక మేరకు మహిళా సంఘానికి 50 కుర్చీలు బహుమతిగా ఇవ్వడం జరిగింది అందుకుగాను మహిళలందరూ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు మేహారాజ్,ఆలుగడ్డ మాధవిగణేష్,గోద లక్ష్మయ్య యాదవ్, రంగంపల్లి దీపిక, బుచ్చోళ్ళ మమతఅరుణ్, బీశ్వ.బాలమణియాదయ్య,రంగంపల్లి శశాంక్ గౌడ్,మాజీ వార్డు సభ్యులు భీశ్వ. బలరాం, గ్రామ పెద్దలు బాల నగరం అశోక్ గౌడ్, చీపిరి గణేష్,దీం పోచయ్య, నరేష్,మహిళా సంఘం అధ్యక్షురాలు గడ్డం మాధవి, బాలనగరం మంగమ్మ,బుక్ కీపర్ మమత, మహిళ సంఘం లీడర్లు సల్మా బేగం, జేరిన బేగం, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామ మహిళలు, పెద్దలు పాల్గొన్నారు...






# మహిళలు సాధించుకున్న హక్కుల రక్షణకై పోరాడాలి

- సీనియర్ న్యాయవాది సిహెచ్ శైలజ
- గోదావరిఖని శ్రామిక భవన్‌లో మహిళా దినోత్సవ సదస్సు

**పెద్దపల్లి బ్యూరో, మార్చి 08 (డిడి9 వార్త):**

అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గోదావరిఖని శ్రామిక భవన్ ప్రాంగణంలో ఏఐటిడబ్ల్యూఏ, సిఐటియు, ఎఐకెఎస్, ఏఐఏడబ్ల్యూ, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ. మహేశ్వరి అధ్యక్షత వహించగా గోదావరిఖని సీనియర్ న్యాయవాది, ఏఐఎల్ యు రాష్ట్ర మహిళ కన్వీనర్ సిహెచ్. శైలజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా సిహెచ్. శైలజ మాట్లాడుతూ... మహిళా దినోత్సవాన్ని కేవలం వేడుకగా కేకులు కట్ చేస్తూ, స్వీట్లు పంచుకుంటూ జరుపుకోవడం కాకుండా దాని వెనుక ఉన్న గొప్ప పోరాట స్ఫూర్తిని సమాజానికి, భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు పనిచేసే రంగాల్లో సమాన వేతనం, పని ప్రదేశాల్లో భద్రత, మౌలిక సదుపాయాల కోసం పోరాడిన రోజునే అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవంగా గుర్తించారని పేర్కొన్నారు. ప్రస్తుతం కూడా పని ప్రదేశాల్లో మహిళలకు సరైన సదుపాయాలు, భద్రతలు లేకపోవడం ఆందోళనకరమన్నారు. ఆధునిక సమాజంలో కొన్ని సీరియల్స్ ద్వారా మహిళల గౌరవాన్ని కించపరిచే విధంగా చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. సావిత్రిబాయి పూలే, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వీర వనితల పోరాటాలు, త్యాగాల స్ఫూర్తితోనే మహిళలు తమ హక్కుల సాధన కోసం ముందుకు సాగుతున్నారని తెలిపారు. నేటి సమాజంలో మహిళలు అంతరిక్షంలో అడుగుపెట్టడమే కాకుండా దేశ రక్షణలో కూడా కీలక పాత్ర పోషిస్తూ తమ ధైర్యసాహసాలను ప్రపంచానికి చాటుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ. మహేశ్వరి, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ ఏ. జ్యోతి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొంటు సాగర్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ దేశంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నప్పటికీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు మహిళలను వంటింటికే పరిమితం చేయాలని మాట్లాడడం దుర్మార్గమన్నారు. మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, దాడులకు ప్రధాన కారణాలైన మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాలను కట్టడి చేయాలని ప్రభుత్వాలను కోరారు. మహిళల రక్షణ కోసం పని ప్రదేశాలు, విద్యాసంస్థలు, నివాస ప్రాంతాల్లో భద్రత కల్పించేలా కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, డివైఎఫ్ఐ గోదావరిఖని పట్టణ కార్యదర్శి అట్ల శివకుమార్, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు అనూష, సృజన, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు.





# హెచ్ పి వి సింగిల్ డోస్ వ్యాక్సిన్ పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణ రావు.

**డిడి9వార్త / పెద్దపల్లి మర్చి 9:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఆదివారం రోజున గర్భాశయ క్యాన్సర్ (సర్వేకల్ కాన్సర్) నివారణ కోసం ఉపయోగించే హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు.మొదటగా సంజన అనే అమ్మాయికి ఎమ్మెల్యే విజయరమణ రావు డాక్టర్ల బృందంతో వాక్సినేషన్ చేయడం జరిగింది. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఆసుపత్రిలో మహిళా సోదరిమణులతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ.హ్యూమన్ పాపిలో మా వైరస్ హెచ్ పి వి వ్యాక్సిన్ ను 14 ఏళ్లు నిండిన బాలికలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వేసుకోవాలని తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించడానికి శాస్త్రజ్ఞులు హెచ్ పి వి వ్యాక్సిన్ ను కనుగొన్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో హెచ్ పి వి వ్యాక్సిన్ ప్రారంభించడం జరిగిందని తెలిపారు. 14 నుండి 15 సంవత్సరాల మధ్య వయసుగల ఆడపిల్లలందరికీ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. మూడు నెల్ల పాటు ఈ వ్యాక్సిన్ పెద్దపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రిలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. 14 సంవత్సరాల బాలికలు తమ ఐడెంటిటీ ప్రూఫ్ తీసుకొని వారి తల్లిదండ్రులలో ఒకరిని తీసుకొని వస్తే ప్రభుత్వ డాక్టర్లు తల్లిదండ్రుల సమ్మతితో వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని వివరించారు. అలాగే పెద్దపల్లి జిల్లా ఆస్పత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఆస్పత్రిని 50 పడకల నుండి 100 పడకలకు ముఖ్యమంత్రి సహకారంతో అభివృద్ధి చేసుకోవడం జరుగుతుందని మరో 8 నెలల్లో నూతన భవనం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఆసుపత్రిలో కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ వేడుకలు జరుపుకోవడం జరిగిందని మహిళ లేనిదే సృష్టి లేదని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గ మరియు జిల్లాలోని మహిళలందరికీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డాక్టర్ల బృందం ఎమ్మెల్యే విజయరమణ రావుని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, వైస్ చైర్మన్ ముస్తాన్ నాజ్ నయ్యర్ మరియు జిల్లా విద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**మహిళా లేనిదే సృష్టి లేదు**

పెద్దపల్లి నియోజకవర్గ మహిళా సోదరిమణులందరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు పెద్దపల్లి శాసనసభ్యులుచింతకుంట రమణా రావు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం రోజున మహిళా సోదరిమణులతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు అనంతరం పెద్దపల్లి నియోజకవర్గ మరియు జిల్లాలోని మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నుగ్గిళ్ల మల్లయ్య, వైస్ చైర్మన్ ముస్తాన్ నాజ్ నాయ్యర్ మరియు మహిళా కౌన్సిలర్లు మరియు మహిళా సోదరిమణులు తదితరులు పాల్గొన్నారు.



# నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..

- **పేదవారి సొంత ఇంటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్న పాయం.**

**మణుగూరు. మార్చి 8(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ హాస్టల్ సమీపంలో నిర్మించిన నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. పేద ప్రజలకు సొంత ఇల్లు కల నెరవేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పాయం తెలిపారు. లబ్ధిదారులు పెనమకూరు వెంకటరమణ కి గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ రామారావు, ఆర్ఐ గోపి, ఎంపీవో వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ సంతోష్, పంచాయతీ సెక్రెటరీ, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, గుట్ట మల్లారం సర్పంచ్ కారం పూజిత, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సిరియాల చైతన్య నాయుడు, వార్డు సభ్యులు మానస, రహీం పాషా, 14వ వార్డు అధ్యక్షులు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, చింతల కృష్ణ, గద్దల ఆదిలక్ష్మి,రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# బి ఆర్ ఎస్ కార్యకర్తలకు అండగా నిలుస్తాం.

- **ఆపదలో ఉన్న పేదవారిని ఆదుకుంటాం: రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి.**
- **నియోజకవర్గంలో పలు కుటుంబాలను కలిసి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేత.**

**డిడి9వార్త / రామగుండం మర్చి 9:**

రామగుండం నియోజకవర్గం అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మడే హరీష్ గౌడ్ అనే బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త అకాల మరణం చెందారు. ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించి వారికీ ఆర్థిక సహాయం(10,000) పదివేల రూపాయలు రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన రేణిగుంట్ల రాజు అనే క్యాన్సర్ వ్యాధి బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం (6000) ఆరు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తామని నియోజకవర్గంలోని ప్రతి పేదవారు ఎవరైనా ఆపద ఉంటే అక్కున చేర్చుకుంటామని 24/7 ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. రైతు పక్షపాతి కెసిఆర్ అధికారంలోకి రావడమే ఎజెండాగా పనిచేస్తామని, కెసిఆర్ ప్రభుత్వం వస్తేనే ప్రజలు సుభిక్షంగా ఉంటారని పేదవారికి ఎల్లవేళలా అండగా నిలుస్తానని హరీష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్,నాయకులు శంకర్ నాయక్, మడ్డి చిరంజీవి, మడ్డి లక్ష్మణ్, ప్రశాంత్, సునీల్,అజయ్, రాజు, సిద్ధూ,ప్రకాష్, అరుణ్,రామ్,సన్నీ,లడ్డు మరియు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



# వంట గ్యాస్ ధరల పెంపు ప్రజలపై భారం

- **తొడుపునూరి రమేశ్ కుమార్**
- **ధరల పెంపును ఖండించిన సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు**

**పెద్దపల్లి బ్యూరో, మార్చి 08 (డిడి9 వార్త):**




వంట గ్యాస్ ధరలను చమురు మార్కెటింగ్ సంస్థలు భారీగా పెంచడం ద్వారా సామాన్య ప్రజలపై పెను భారాన్ని మోపుతున్నారని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. పెరిగిన ధరలు ఈ రాత్రి నుంచే అమల్లోకి వస్తున్నట్లు ప్రకటించడం దారుణమని అన్నారు. గృహ వినియోగ సిలిండర్‌పై రూ.60, కమర్షియల్ సిలిండర్‌పై రూ.115 పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకోవడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఈ పెంపుతో గృహ వినియోగ సిలిండర్ ధర వెయ్యి రూపాయలకు చేరుకునే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరలు పెరగడంతో హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగదారులపై కూడా అదనపు ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు మరియు ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగినందున వంట గ్యాస్ ధరలు పెంచక తప్పలేదని చమురు సంస్థలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినప్పుడు దేశంలో ధరలు తగ్గించిన దాఖలాలు లేవని విమర్శించారు. త్వరలోనే పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరగవచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయని, దీంతో సామాన్య ప్రజల జీవనం మరింత కష్టసాధ్యమవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలతో ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వంట గ్యాస్ ధరలను తగ్గించేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని తొడుపునూరి రమేశ్ కుమార్ డిమాండ్ చేశారు.

# జనగామ అమ్మ క్యాంటీన్

**జనగామ మార్చ్ 8 (డిడి9) వార్త**



ఈ దేశం మనకేమిచ్చింది కాదు దేశానికి మనమేం చేసామన్నదే ముఖ్యం సమాజంలో జీవిస్తున్న నిరుపేదలకి నిరాశ్రయులకు అనాధలకు నిరుపేద కుటుంబాల చిన్నారులకు చేయితనందిద్దాం ఉండడానికి నీడ కట్టుకోవడానికి వస్త్రాలు త్రాగడానికి నీరు ఆహారం అందిద్దాం జనగామ అమ్మ ఫౌండేషన్ సేవా కార్యక్రమంలో భాగస్వాములవుదాం రండి కదలి రండి*1

*ఈరోజు జనగామ వైట్ అండ్ వైట్ క్లాత్ షోరూం యజమాని గజ్జి మధు గారు మానవత దృక్పథంతో జనగామ పట్టణంలో నివసిస్తున్న గుడిసెవాసుల నిరుపేదల ప్రజల చిన్నారులకి వస్త్రాలు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు

*ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజు గారు మాట్లాడుతూ జనగామ అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో గజ్జి మధు గారు అమ్మ ఫౌండేషన్ అన్న సమర్పణ కార్యక్రమానికి ఓమ్ని వెహికల్ ని మరియు నిత్యవసర సరుకులు బియ్యం గుడిసె వాసుల పిల్లలకి వస్త్రాలను అందించడం వారి స్నేహితులతో కూడా అమ్మ క్యాంటీన్ కు గిన్నెలు కూడా ఇతరాంతర సహాయ సహకారాలు అందించడం జరిగింది నిరంతరం ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా మహా అన్న సమర్పణ కార్యక్రమానికి నిరంతరం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ మానవత్వాన్ని చాటుకున్నారని ప్రతి ఒక్కరు సందర్భం ఏదైనా కానీ భారతదేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణే లక్ష్యంగా మేము మీ గ్రామస్థాయి పట్టణ స్థాయిలో ప్రజలు యువత కలిసికట్టుగా సామాజిక సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు

*ఈ సేవా కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడా రవి బింగి నరసింహులు గుగులోతు ప్రభాకర్ కోడం నవీన్ మణి లకన్ సింగ్ ఎండి అప్రోచ్ , కొయ్యాడ విశ్వ చిన్న తదితరులు పాల్గొన్నారు

# దశావతార శ్రీకృష్ణ పరమాత్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..



- **ప్రజలందరికీ శాంతి సౌభాగ్యాలు కలగాలని, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ప్రార్థించారు.**
- **భక్తి,ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతిని, ఐక్యతను పెంపొందిస్తాయని కొనియాడారు.**

**మణుగూరు. మార్చి 8(డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా,మణుగూరు మండలం సుందరయ్య నగర్‌లో ఆదివారం నాడు అంగరంగ వైభవంగా నిర్వహించిన దశావతార శ్రీకృష్ణ పరమాత్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీకృష్ణ పరమాత్మ ఆశీస్సులు తీసుకున్నారు. గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే పాయం భక్తులతో కలిసి పూజల్లో పాల్గొని, ప్రాంత ప్రజలకు శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, కరకగూడెం మండల అధ్యక్షులు ఇక్బాల్ హుస్సేన్, 14 టైర్ అధ్యక్షులు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, గుట్ట మల్లారం సర్పంచ్ కారం పూజిత, సమితి సింగారం ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సిరియాల చైతన్య నాయుడు, బొగ్గు ముఠా అధ్యక్షులు నీరుడు రాంబాబు, సాదిని సీతయ్య, అబ్దుల్లా, బానోత్ లక్ష్మణ్, రామిరెడ్డి ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 49వ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్పొరేటర్ సాగి సంతోష్ రావు






- **మార్కండేయ కాలనీలో నాలా పూడికతీత... కార్పొరేటర్ పర్యవేక్షణలో..**
- **మేయర్ మహంకాళి స్వామి, కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని పరిశీలన**

**పెద్దపల్లి బ్యూరో, మార్చి 08 (డిడి9 వార్త):**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 49వ డివిజన్ మార్కండేయ కాలనీలో నాలా పూడికతీత పనులు శనివారం చురుగ్గా కొనసాగాయి. డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న కార్పొరేటర్ సాగి సంతోష్ రావు ఆధ్వర్యంలో ఈ పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య యాదవ్ పాల్గొని పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ... ప్రజలు చెత్తను బయట పడేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేవలం రూ.40 చెల్లిస్తే రాగ్ పిక్కర్లు ఇంటి వద్దకు వచ్చి చెత్తను సేకరిస్తారని తెలిపారు. అయినప్పటికీ కొంతమంది చెత్తను రోడ్లు, కాలువలు, ఖాళీ స్థలాల్లో పడవేయడం విచారకరమన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చెత్తను బయట పడేస్తే రూ.500 జరిమానా విధించే యోచన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏళ్ల తరబడి కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగు నీరు నిలిచి దోమలు, పందుల సమస్య తీవ్రంగా పెరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు అదనపు పారిశుద్ధ్య వాహనాలు, సిబ్బందిని వినియోగించి కాలువల పూడికతీత పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆలోచనలకు అనుగుణంగా రామగుండం నగరాన్ని "క్లీన్ అండ్ గ్రీన్ రామగుండం"గా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సాగి సంతోష్ రావు మాట్లాడుతూ... తాను ఎన్నికైనప్పటి నుంచి డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మేయర్ సహకారంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం మార్కండేయ కాలనీ నెహ్రూ యూత్ అసోసియేషన్ లైన్‌లో వీధి మొత్తం నూతన స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేసే పనులను 49వ డివిజన్ కార్పొరేటర్ సాగి సంతోష్ రావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఎస్ఈ గురువీర, ఈఈ పీవీ రామన్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల రిలే నిరాహార దీక్షకు న్యూ ఇండియా పార్టీ పూర్తి మద్దతు.

- **సీఐ ఇంద్రసేనారెడ్డిని వెంటనే తొలగించాలని డిమాండ్.**

**డిడి9వార్త / రామగుండం మర్చి 9:**




గోదావరిఖాని గత 25 రోజులుగా న్యాయం కోసం, ధర్మం కోసం తమ వృత్తి విధులను పక్కనపెట్టి ఉద్యమిస్తున్న స్థానిక న్యాయవాదులకు మద్దతుగా న్యూ ఇండియా పార్టీ నాయకత్వం డాక్టర్ జె.వి. రాజు మరియు వేముల అశోక్ ఈ రోజు దీక్షా శిబిరాన్ని సందర్శించారు. వారు న్యాయవాదులతో సంఘీభావం తెలిపి మాట్లాడుతూ...గోదావరిఖాని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించడం, దుర్వ్యవహారాలు చేయడం, ప్రజలను కొట్టడం, తిట్టడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భారత రాజ్యాంగం, భారత శిక్షాస్మృతి (ఐపీసీ ), తెలంగాణ పోలీస్ మాన్యువల్ ప్రకారం పోలీసు అధికారులు ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా, చట్టబద్ధంగా మాత్రమే ప్రవర్తించాలి. పోలీసులు ప్రజల సేవకులు మాత్రమే - ప్రజలు వారికి జీతాలు, సౌకర్యాలు కల్పించి నియమించిన యజమానులు.ఇటీవల న్యాయవాదులపై కూడా పోలీస్ మాన్యువల్‌కు, చట్టాలకు విరుద్ధంగా దురుసుగా ప్రవర్తించడం వల్లే ఈ ఉద్యమం ప్రారంభమైంది. ఇలాంటి ప్రజా వ్యతిరేక వైఖరిని సహించలేమని, సీఐ ఇంద్రసేనారెడ్డిని భారత రాజ్యాంగం ఆర్టికల్ 311 ప్రకారం వెంటనే ఉద్యోగం నుండి తొలగించాలని న్యూ ఇండియా పార్టీ డిమాండ్ చేస్తోంది.గతంలో ఓల్డ్ అశోక్ టాకీస్ కూల్చివేత విషయంలో కూడా రౌడీలు, కాంగ్రెస్ కార్యకర్తలకు సహకారం అందించి, అక్రమ నిర్బంధం చేసిన సంగతి తెలిసిందే. పట్టణంలో ఇలాంటి అనేక సంఘటనల్లో అతని దుర్వ్యవహారాలు, అనుచిత ప్రవర్తన కొనసాగుతున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఐ ఇంద్రసేనారెడ్డిని వెంటనే తొలగించి, న్యాయవాదుల ఉద్యమానికి న్యాయం చేయాలని న్యూ ఇండియా పార్టీ ఈ సందర్భంగా ఘనంగా విజ్ఞప్తి చేస్తోంది.

## కాకతీయ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో,మహిళలకు సన్మానం

**గోవిందరావుపేట, మార్చి 8( డి డి 9 వార్త)**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పస్రా గ్రామంలో కాకతీయ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ఘనంగా సన్మానం చేశారు. సమాజానికి సేవలందిస్తున్న టీచర్‌తో పాటు గ్రామ పారిశుధ్య కార్మికులను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యా రంగంలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కష్టపడుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తిస్తూ శాలువాలు కప్పి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ వాకర్స్ క్లబ్ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు స్థానికులు పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు గౌరవం తెలపడం సంతోషకరమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.



## పల్లె ప్రగతి ప్రణాళికా పనులును పరిశీలించిన జిల్లా పంచాయతీ రాజ్ అధికారి

- **పారిశుద్ధ్య పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు**
- **సర్పంచ్ ఉపసర్పంచ్ లకు ప్రత్యేక అభినందనలు తెలియజేసిన అధికారులు**
- **ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికాలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు**

**బోనకల్,మార్చి08,(డీడీ9 వార్త):**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ప్రజా పాలనప్రగతి ప్రణాళికా 99 రోజుల అనే కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ ఉపసర్పంచ్ బానోతు జ్యోతి కొండ ఆధ్వర్యంలో గ్రామంలో పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు అఖిల పక్ష నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో డ్రైనేజీల్లో వ్యర్థాలను తొలగించుట, రోడ్లకు ఇరువైపులు ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించడం వంటి కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టారు.మండల కేంద్రంలో జరుగుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన పారిశుధ్య పనులు జిల్లా పంచాయతీ రాజ్ అధికారి టి రాంబాబు,మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్ రమాదేవి ఆకస్మికంగా పరిశీలించారు,గ్రామంలో ఎక్కడా లేని విధంగా చెత్త డ్రమ్ములను విస్తృతంగా ఏర్పాటు చేయడాన్ని చూసి డిపిఓ,ఎంపిడిఓ సర్పంచ్ ఉపసర్పంచ్ లను ప్రత్యేకంగా అభినందించారు.బోనకల్ గ్రామ అఖిలపక్ష నాయకులు ప్రజా పాలనప్రగతి పాలన కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక బ్యానర్ పట్టుకొని వీధుల వెంట తిరుగుతూ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. సర్పంచ్ ఉప సర్పంచ్ బానోతు జ్యోతి బానోతు కొండ ఆధ్వర్యంలో గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను చూసి డిపిఓ,ఎంపిడిఓ సర్పంచ్ ఉప సర్పంచ్లను అభినందించారు. మొదటి సారి గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చిన జిల్లా పంచాయతీ అధికారి టి రాంబాబుని గ్రామపంచాయతీ సర్పంచ్ ఉప సర్పంచ్ ఎంపీడీఓ,సెక్రటరీ రాజేశ్వరితో కలిసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోల రాజేశ్వరి,ఏపిఎం వెంకటేశ్వర్లు,అఖిలపక్ష నాయకులు గుండపనేని సుధాకర్ రావు,తేళ్లూరి రమేష్,చిట్టోజు శ్రీనివాస్ గాలి దుర్గారావు,తోటపల్లి స్వామి,తెల్లాకుల శ్రీనివాసరావు,గుగులోతు నాగేశ్వరరావు,గంగుల శ్రీనివాసరావు,గుగులోతు రమేష్,గంగుల పుల్లయ్య, బానోతులక్ష్మి,అంతోటి రవి ప్రసాద్,భూక్య గోర్క, పాసంగులపాటి కోటేశ్వరరావు,మోర్ల వంశీ, ఒరుగు నరసింహారావు,మరీదు కనకయ్య,వార్డు నెంబర్లు ఉప్పర శ్రీను ,అంతోటి శ్రీను,ఎస్.కె మీరా సాహెబ్, మరీదు శేషు,గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్స్ మంద నాగరాజు,మరీదు కుమారి,గాదె వెంకటేశ్వర్లు, అంతోటి రమేష్,ధరావత్ బాలకృష్ణ,గుగులోతు వెంకటేశ్వర్లు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## జనగాం ఇందిరా మహిళా శక్తి పథకం లో భాగంగా shg సభ్యులకు ఎరువుల విక్రయ కేంద్రాల నిర్వహణ

**జనగామ మార్చి8(డిడి9) వార్త**

జిల్లా రైతులకు విత్తనాలు ఎరువులు సకాలంలో, సులభంగా అందుబాటులో ఉండే విధంగా ప్రతి క్లస్టర్‌లో స్వయం సహాయక సంఘాల (SHGs) ద్వారా ఎరువుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని *జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. SHG సభ్యులు ఫర్టిలైజర్ షాప్ నిర్వహణ అంశం మీద శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయ సమావేశం కలెక్టరెట్ లోని మినీ కాన్ఫరెన్స్ హల్ లో నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా *కలెక్టర్ మాట్లాడుతూ.... రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాల సామగ్రి రైతులకి మరింత సులభం గా అందించేందుకు వ్యవస్థను బలోపేతం చేయడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాబోయే సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఇన్‌పుట్‌లు పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జనగామ జిల్లాలో మొత్తం 62 క్లస్టర్లు ఉన్నాయని, ప్రతి క్లస్టర్‌లో ఒక ఎరువుల విక్రయ కేంద్రంను స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఎరువులు మరియు విత్తనాలు సమీపంలోనే అందుబాటులోకి రావడంతో పాటు రైతుల సమయం, రవాణా ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. అలాగే ఈ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాలకు ఆర్థికంగా స్థిరత్వం కలగడంతో పాటు వారి ఆదాయం పెరుగుతుందని, దీని ద్వారా గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు కూడా తోడ్పాటు లభిస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులు DRDOతో సమన్వయం చేసుకొని అవసరమైన అర్హతలు, లైసెన్సులు, శిక్షణ, ఇతర ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేసి ప్రతి క్లస్టర్‌లో ఎరువుల విక్రయ కేంద్రం స్థాపనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాబోయే సాగు సీజన్‌కు ముందుగానే ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు మరియు ఎరువులు సకాలంలో అందుబాటులోకి రావడమే కాకుండా వ్యవసాయ ఉత్పాదకత పెరగడానికి కూడా దోహద పడుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో DRDO, జిల్లా వ్యవసాయ అధికారి (DAO), సహాయ వ్యవసాయ సంచాలకులు (ADAs), వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్లు (APMs) కమ్యూనిటీ కోఆర్డినేటర్లు (CCలు) పాల్గొన్నారు.



## బీజేపీ 'పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ

**జనగామ మార్చి 8 (డిడి 9 వార్త )**

మహాభియాన్-2026' కార్యక్రమం నిర్వహణ జనగామ జిల్లా జఫర్గడ్ మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో బీజేపీ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్-2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జఫర్గడ్ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నగేష్ గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉడుగుల రమేష్, రాష్ట్ర నాయకులు బేజాడి బీరప్ప, ప్రశిక్షణ కార్యక్రమ కన్వీనర్ బల్ల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు బొజ్జపల్లి సుభాష్ తదితరులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలోని అంజిరెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రడపాక ప్రదీప్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎండీ వలి పాషా, మండల పరిధిలోని రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




# బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నిశ్చితార్థం

నటుల వివాహాలతో టాలీవుడ్‌లో సందడి నెలకొంది. విజయ్ దేవరకొండ, అల్లు శిరీష్ బ్యాచిలర్ లైఫ్‌కు ఇటీవల గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. ఆ జాబితాలోకి బెల్లంకొండ సాయి శ్రీనివాస్ చేరబోతున్నారు. త్వరలోనే ఆయన పెళ్లి చేసుకోబోతున్నారు. సాయి శ్రీనివాస్ నిశ్చితార్థం ఆదివారం ఉదయం జరిగింది. ఈ వేడుకకు దర్శకుడు బోయపాటి శ్రీను, హీరోయిన్ సంయుక్త తదితర సినీ ప్రముఖులు హాజరయ్యారు. శ్రీనివాస్‌కు కాబోయే భార్య పేరు కావ్య. హైదరాబాద్‌కు చెందిన ఆమెకు సినీ రంగంతో సంబంధం లేదు. కొన్నాళ్లుగా వీరిద్దరు ప్రేమలో ఉన్నట్లు తెలిసింది. నిర్మాత బెల్లంకొండ సురేశ్ తనయుడైన సాయి.. 'అల్లుడు శీను'తో గ్రాండ్‌గా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. 'జయ జానకి నాయక'లాంటి యాక్షన్ చిత్రాలతోపాటు 'రాక్షసుడు', 'కిష్కింధపురి'లాంటి థ్రిల్లర్లతో అలరించారు. ప్రస్తుతం 'హైందవ', 'టైసన్ నాయుడు' సినిమాల్లో నటిస్తున్నారు.



# నటుడి కంటే దర్శకుడిగా వచ్చే మజా వేరు..

టాలీవుడ్ ఇండస్ట్రీలో దర్శకుడిగా, నటుడిగా మంచి గుర్తింపును సంపాదించుకున్న వారిలో తరుణ్ భాస్కర్ ఒకరు. ఈయన సినీ పరిశ్రమలోకి దర్శకుడిగా ఎంట్రీ ఇచ్చాడు. పెళ్లి చూపులు చిత్రంతో దర్శకుడిగా కెరీర్ను మొదలుపెట్టాడు. ఈ మూవీ ప్రేక్షకుల, విమర్శకుల ప్రశంసలను పొంది అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ఈ సినిమాతో తరుణ్ భాస్కర్ కి చాలా గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత ఈ దర్శకుడు రూపొందించిన ఈ నగరానికి ఏమైంది, కీడా కోలా చిత్రాలు కూడా మంచి ప్రేక్షకాదరణ పొందాయి.
ఈ నగరానికి ఏమైంది చిత్రం తర్వాత ఈ నటుడు దర్శకత్వంపై కంటే కూడా నటనపై ఎక్కువ ఆసక్తిని చూపిస్తూ వస్తున్నాడు. అందులో భాగంగా ఇప్పటికి చాలా సినిమాలలో నటించి మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. ప్రస్తుతం తరుణ్ భాస్కర్ 'గాయపడిన సింహం'లో ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. ఫిబ్రవరి 9న దీన్ని విడుదల చేయనున్నారు. ఈ మూవీ విడుదల తేదీ దగ్గర పడడంతో తాజాగా తరుణ్ చాలామందితో ముచ్చటించాడు.
అందులో భాగంగా ఈయనకు మీరు ఒకవైపు సినిమాలకు దర్శకత్వం వహిస్తున్నారు, మరోవైపు నటిస్తున్నారు, ఈ రెండింటిలో మీకు ఏది అంటే చాలా ఇష్టం అనే ప్రశ్న ఎదురయింది. దీనికి తరుణ్ భాస్కర్... నాకు నటన కంటే దర్శకత్వం అంటే చాలా ఇష్టం. అందుకు కారణం... నటించే సమయంలో మనకు ఎవరి కంట్రోల్ ఉండదు, అదే దర్శకత్వం చేసే సమయంలో అందరినీ మనం కంట్రోల్ చేయవచ్చు, అలాగే మరికొన్ని విషయాలలో కూడా నటన కంటే దర్శకత్వం చాలా బెటర్ అని తరుణ్ భాస్కర్ చెప్పుకొచ్చాడు.





# లివింగ్ రిలేషన్‌పై మానస వారణాసి బోల్డ్ కామెంట్స్!

టాలీవుడ్ యంగ్ హీరోయిన్, మాజీ మిస్ ఇండియా మానస వారణాసి ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న విడుదలైన తన రెండో చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'తో మంచి విజయాన్ని అందుకున్న ఈ బ్యూటీ, తాజాగా ఒక ఇంటర్వ్యూలో 'లివింగ్ టుగెదర్' అంశంపై షాకింగ్ కామెంట్స్ చేసింది. 'ఏ బంధంలోనైనా అవగాహన అనేది చాలా ముఖ్యం, ఒకరినొకరు పూర్తిగా తెలుసుకోవడానికి లివింగ్ రిలేషన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. పాత కాలంలో పెళ్లయ్యాక మాత్రమే ఒకరి గురించి ఒకరు తెలుసుకునేవారు, దానివల్ల ఎన్నో కాంప్రమైజ్ అవ్వాల్సి వచ్చేది.. కానీ
ఇప్పుడున్న పరిస్థితుల్లో లివింగ్ రిలేషన్ వల్ల ముందే ఒకరి స్వభావం, ఆలోచనలు అర్థం చేసుకునే అవకాశం దక్కుతోంది. అప్పటి వారిలా సర్దుకు పోయే తత్వం ఇప్పటి వారిలో లేదు' అని మానస తన అభిప్రాయాన్ని వెల్లడించింది. అయితే.. మానస చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీశాయి. కొంతమంది ఆమె ఆలోచనా ధోరణిని సమర్థిస్తుంటే, మరికొందరు మాత్రం పెళ్లికి ముందే కలిసి ఉండటం ఏంటని భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# నేను ఎవరి కథనీ దొంగిలించలేదు

'సరస్వతి' చిత్ర కథ విషయమై రచయిత బుర్రా సాయిమాధవ్ చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు నటి, దర్శక నిర్మాత వరలక్ష్మి శరత్ కుమార్. సాయిమాధవ్ ఇచ్చిన కథలోని లైన్‌ను మాత్రమే తీసుకున్నామని.. తానే కొత్తగా కథ రాసుకుని, స్క్రీన్‌ప్లే చేసుకున్నానని, అయినా ఆయనపై గౌరవంతో సినిమాలో ఆయన పేరు కూడా వేశామని తెలిపారు. వరలక్ష్మి ప్రధాన పాత్రలో నటిస్తూ స్వయంగా తెరకెక్కించిన ఈ చిత్రాన్ని.. ఆమె తన సోదరి పూజా శరత్‌కుమార్‌తో కలిసి నిర్మించారు. ఇది ఇటీవల విడుదలైన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో థాంక్యూ మీట్ నిర్వహించారు.
ఈ సందర్భంగా వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ.. "నేను ఎవరి కథనీ దొంగిలించలేదు. అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేశాకే సాయిమాధవ్ నుంచి కథ తీసుకున్నాం. ఆయన రాసింది ల్యాగ్ ఉందని చాలామంది అన్నారు. క్లైమాక్స్ మార్చాలని ఆయనకు ముందు నుంచే చెప్పా. కానీ, పెద్ద సినిమాలతో బిజీ అయిపోయి మా సినిమాని పట్టించుకోలేదు. స్టోరీ సిట్టింగ్స్‌కి తను ఒక్కసారి కూడా అందుబాటులో లేరు. దీంతో ప్రేక్షకుల్ని దృష్టిలో ఉంచుకుని కథలో.. క్లైమాక్స్‌లో మార్పులు చేశా. కానీ, ఆయనపై గౌరవంతో కథ క్రెడిట్ తనకే ఇచ్చాం. అయినా ఆయన అలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదు" అన్నారు. 'సరస్వతి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి దక్కుతున్న ఆదరణ పట్ల సంతోషం వ్యక్తం చేశారు. క్లైమాక్స్ చూసి ప్రతి ఒక్కరూ సర్‌ప్రైజ్ అవుతున్నారని వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో నిచోలాయ్ సచ్‌దేవ్, పూజా శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఆ హీరోకు నాన్న క్యారెక్టర్ అంటే నేను చచ్చినా చేసేవాణ్ణి కాదు

శివాజీ ప్రధాన పాత్రలో నవదీప్, రవికృష్ణ, నందు, బిందు మాధవి వంటి వారు ఇతర కీలక పాత్రలలో నటించిన చిత్రం 'దండోరా'. ఈ సినిమాని 'బెదురులంక', 'కలర్ ఫోటో' సినిమాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించారు. కొత్త దర్శకుడు మురళీకాంత దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది. ఇటీవల ప్రకటించిన గద్దర్ అవార్డ్స్ 2025 ఏడాదికి గానూ ఉత్తమ రెండవ చిత్రంగా 'దండోరా' అవార్డును దక్కించుకుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం థ్యాంక్యూ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు శివాజీ పాల్గొని పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఈ సినిమాలో నందుకు నాన్న క్యారెక్టర్ అంటే నేను చచ్చినా చేసేవాణ్ణి కాదు. నందుకు నాన్న క్యారెక్టర్ అని నాకు ముందు చెప్పలేదు. ఈ సినిమా కథ చెబుతున్నప్పుడు, వీళ్లందరితో షూటింగ్ అయిపోయిందన్న



విషయం నాకు లొకేషన్‌కి వెళ్లే వరకు తెలియదు. అమ్మతోడు.. ఎవడూ చేస్తాడండి నందుకు తండ్రి అంటే.. ఎంత ఉన్నాడు చూశారు కదా. నవదీప్ అంటే మా సర్పంచ్, అతనితో చేయవచ్చు, నందూ కొడుకు ఏంటి, ఘోరంగా, అరాచకం' అని సరదాగా అన్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# నయనతార నెక్స్ట్ ప్లాన్ అదిరిపోయిందిగా

దక్షిణాదిలో అత్యధిక పారితోషికం తీసుకునే హీరోయిన్లలో ఒకరైన నయనతార, ఇప్పుడు బాలీవుడ్‌పై మళ్ళీ ఫోకస్ పెట్టింది. మెగాస్టార్ చిరంజీవితో కలిసి నటించిన 'విశ్వంభర' (శంకర్ వరప్రసాద్) సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న నయన్, ప్రస్తుతం హిందీలో ఒక క్రేజీ ప్రాజెక్టుకు ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. ముంబైకి చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ 'మినీ ఫిల్మ్స్' నిర్మించబోయే ఒక భారీ చిత్రంలో ఆమె నటించనుందట. గతంలో 'ఫోరెన్సిక్', 'ఆంఖో కి గుస్తాకియా' వంటి విభిన్నమైన చిత్రాలను అందించిన ఈ సంస్థ, నయనతార కోసం ఒక పవర్‌ఫుల్ కథను సిద్ధం చేసిందట. కథతో పాటు తన పాత్రకు ఉన్న ఇంపార్టెన్స్ నచ్చడంతో నయనతార వెంటనే ఈ ప్రాజెక్టుకు సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. నిజానికి 'జవాన్' సినిమా తర్వాత నయనతారకు బాలీవుడ్ నుండి కుప్పలు తెప్పలుగా ఆఫర్లు వచ్చాయి. కానీ, కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, పెర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్రలనే ఆమె ఎంచుకుంటోంది. ఈ కొత్త సినిమా కోసం ఆమెకు భారీ స్థాయిలో రెమ్యునరేషన్ కూడా ఆఫర్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఒకవైపు యష్‌తో కలిసి నటిస్తున్న 'టాక్సిక్' (Toxic) సినిమా విడుదలకు సిద్ధమవుతుండగా, మరోవైపు ఈ కొత్త హిందీ ప్రాజెక్టుతో నార్త్ ఆడియన్స్‌ను అలరించేందుకు నయన్ రెడీ అవుతోంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుంది. నయనతార తన సెకండ్ బాలీవుడ్ మూవీతో ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలి.



# 'ఆదర్శ కుటుంబం'.. ఫ్యామిలీ డ్రామా అనుకుంటే పొరపాటే..



విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'ఆదర్శ కుటుంబం : హౌస్ నెం. 47' (AK 47) ప్రస్తుతం సైలెంట్‌గా షూటింగ్ జరుపుకుంటోంది. టైటిల్ చూస్తే పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లా అనిపిస్తున్నా, లోపల మాత్రం త్రివిక్రమ్ గట్టి ప్లానే వేసినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ సినిమా కథ గురించి వినిపిస్తున్న ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఫస్ట్ హాఫ్ అంతా 'మల్లీశ్వరి', 'నువ్వు నాకు నచ్చావ్' సినిమాల్లాగా వెంకీ మార్క్ కామెడీతో కడుపుబ్బ నవ్విస్తుందట. కానీ, ఇంటర్వెల్ దగ్గర వచ్చే ఒక ఊహించని ట్విస్ట్ సినిమాను ఒక్కసారిగా సీరియస్ మోడ్‌లోకి తీసుకెళ్తుందని సమాచారం. టైటిల్ కింద ఉన్న 'AK 47' అనే ట్యాగ్‌లైన్‌కు తగ్గట్టుగానే సెకండ్ హాఫ్‌లో సాలిడ్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉంటాయట. ఎలా..? అంటే.. సినిమా సెకండ్ హాఫ్ త్రివిక్రమ్ క్లాసిక్ హిట్ 'అతడు'లోని మలుపులను గుర్తుకు తెస్తుందని టాక్. 'గుంటూరు కారం' సమయంలో జరిగిన తప్పులు రిపీట్ కాకుండా, ఈసారి 'అల వైకుంఠపురములో' తరహా ఫ్యామిలీ ఎమోషన్స్ మరియు క్లాస్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను త్రివిక్రమ్ పర్ఫెక్ట్‌గా బ్యాలెన్స్ చేస్తున్నారట. ఇక శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ (యానిమల్ ఫేమ్) సంగీతం అందిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుగుతుండటంతో, వేసవి నుంచే ప్రమోషన్స్ మొదలుపెట్టి, అక్టోబర్ 2న సినిమాను గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# ఇది నా పూర్వజన్మ సుకృతం



బెంగళూరు కిమ్స్ హాస్పిటల్ స్పెషాలిటీ బ్లాక్‌ను టాలీవుడ్ హీరో ఎన్టీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కర్ణాటకకు రావడం అమ్మమ్మ వాళ్ల ఇంటికి వచ్చినట్లుగా ఉంటుంది. 1983 మార్చి 20న తాతగారు ఇక్కడ శంకుస్థాపన చేశారు. మళ్లీ ఇన్నాళ్లకు అదే మార్చిలో నేను రావడం ఆనందంగా ఉంది. ఇది నా పూర్వజన్మ సుకృతం అనుకుంటున్నా. తాత ఆశీస్సులు, మీ అందరి ప్రేమ వల్లే ఇది సాధ్యమైంది" అని పేర్కొన్నారు. వాహనాలను నడిపే సమయాల్లో జాగ్రత్తగా ఉండాలని ఎప్పటిలాగే అభిమానులకు సూచించారు. పాతికేళ్ల తర్వాత ఎన్టీఆర్ ఎలా ఉంటారు? అని ఓ వైద్యుడు అడగ్గా.. 67 అంటూ (అప్పటికి తన వయసు) నవ్వులు పూయించారు. ఒకవేళ డాక్టర్ అయితే.. దేనిలో స్పెషలిస్ట్ అయ్యేవారు? అని అడగ్గా.. పీడియాట్రిషియన్ (చిన్నపిల్లల వైద్యుడు) అని చెప్పారు. తనకు చిన్నారులంటే ఇష్టమన్నారు.
తమ అభిమాన నటుడిని చూసేందుకు ఆస్పత్రి వద్దకు ఫ్యాన్స్ తరలి వచ్చారు. కారులోంచే అభిమానులకు అభివాదం చేశారు ఎన్టీఆర్. కొత్త సినిమా లుక్‌తో కూడిన ఎన్టీఆర్ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో నటిస్తున్న సినిమా కోసమే ఎన్టీఆర్ ఈ లుక్‌లోకి మారారు. చెవికి రింగ్ కూడా పెట్టుకున్నారు. ఈ సినిమాకి 'డ్రాగన్' అనే టైటిల్ అనుకున్నారు. ఇందులో ఎన్టీఆర్ సరసన కన్నడ నటి రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా మే 20న ఆయన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోందని సమాచారం.